

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 343 | హైదరాబాద్ | గురువారం | 21-05-2026 | పేజీలు: 08


## జలమండలి జీఎంకు 14 రోజుల రిమాండ్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్

హైదరాబాద్, సికింద్రాబాద్ సహా 8 చోట్ల ఏకకాలంలో సోదాలు

ఇంట్లో భారీగా నగదు, బంగారం, వెండి గుర్తింపు

రిజిస్ట్రేషన్ విలువ రూ.5.88 కోట్లు, మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా అంచనా

సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 18 ఎకరాల భూమి వెలుగు

గేటెడ్ కమ్యూనిటీలో 3 ప్లాట్లు, ఖరీదైన ఇల్లు గుర్తింపు

కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలింపు

అవినీతి కేసుపై ఏసీబీ లోతైన దర్యాప్తు కొనసాగింపు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

హైదరాబాద్ జలమండలిలో భారీ అవినీతి వెలుగులోకి వచ్చింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జలమండలి ప్రాజెక్టు డివిజన్-3 జీఎం (ఇంజినీరింగ్) సగ్గం అనంత లక్ష్మి కుమార్ ను ఏసీబీ అధికారులు ..మిగతా 2లో

## తెలంగాణలో విద్య, మౌలిక వసతులకు సహకరించండి

కేంద్రానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

నిర్మలా సీతారామన్ భేటీ

రాష్ట్ర ఆర్థిక అవసరాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చ

సాస్కీ కింద రూ.5 వేల కోట్ల సాయం కోరిన తెలంగాణ

విద్యా రంగంలో భారీ పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు కోసం విజ్ఞప్తి

ఎస్‌పీవీ అప్పుల భారాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన డిప్యూటీ సీఎం

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు నిధుల అవసరం

రూ.30 వేల కోట్ల విద్యా పెట్టుబడి ప్రణాళిక

గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక మద్దతు

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారం కోరిన భట్టి విక్రమార్క

తెలంగాణ ఆర్థిక ఒత్తిడిపై కీలక చర్చలు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ఆర్థిక అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన కేంద్ర సహకారం విషయంపై ఆయన సమగ్రంగా వివరించారు. ప్రత్యేకంగా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సాయం ఇవ్వాలని ..మిగతా 2లో



# నెట్ జీరో సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ..



నెట్ జీరో సిటీగా 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి సీఎం ఆదేశాలు

ఇన్వెస్టర్ల కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రత్యేక సెల్ ఏర్పాటు

ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ డిజైన్

జూన్‌లో పరిశ్రమల శంకుస్థాపనలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇవాళ ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ బోధి పెవిలియన్‌లో ఆయన పరిశ్రమల శాఖపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో.. ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటు, ఐటీ పాలసీలపై సీఎం అధికారులకు పలు ..మిగతా 2లో




## మెట్రో విస్తరణకు కేంద్రానికి అభ్యంతరం లేదు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

162 కిలోమీటర్ల మెట్రో విస్తరణ ప్రతిపాదనలపై కేంద్ర పరిశీలన

కేంద్ర–రాష్ట్ర సమాన భాగస్వామ్యంతో మెట్రో ప్రాజెక్టు ముందడుగు

హైదరాబాద్ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్రాల కీలక చర్చలు

మూసీ ప్రక్షాళనకు భారీ స్థాయి ఎస్‌టీపీ ప్రాజెక్టుల మంజూరు

39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లతో నది కాలుష్య నియంత్రణ లక్ష్యం

రూ.3,975 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 ప్రాజెక్టుల రూపకల్పన

రోజుకు 972 ఎంఎల్డీ మురుగు నీటి శుద్ధి సామర్థ్యం ఏర్పాటు

మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర సూత్రప్రాయ అంగీకారం

నగర మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికపై దృష్టి

హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు

## విచారణకు సహకరిస్తున్నా.. అందుకే నా కుమారుడిని అప్పగించా

కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

తెలంగాణలో కుటుంబపాలన అంతం చేశాను

అందుకే కొందరు నా మీద పగబట్టినట్టు వ్యవహరిస్తున్నారు

"చనిపోయిన తర్వాత కూడా పార్టీ జెండా కప్పుకుంటాను

అవినీతి సామ్రాజ్యాన్ని కూల్చినది బీజేపీనే అని వ్యాఖ్య

హైదరాబాద్‌లో మీడియాతో సంజయ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

బీజేపీ కార్యకర్తల క్రమశిక్షణ, నిబద్ధతపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పార్టీ కోసం పూర్తిస్థాయి అంకిత భావంతో పనిచేసే కార్యకర్తను అడిగితే, తన చివరి కోరిక కూడా "మరణానంతరం బీజేపీ జెండా కప్పుకోవాలి" ..మిగతా 2లో

## జనగణనలో కుల గణన వద్దని ఆదేశించలేం

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

అది విధానపరమైన అంశమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

వెనుకబడిన తరగతుల జనాభా తెలుసుకోవడం అవసరమని అభిప్రాయం

జనగణనతోపాటు కులగణన చేయొద్దంటూ పిల్

డేటా దుర్వినియోగం వాదనను పిటిషనర్ తరపు వినిపించిన వాదన

న్యాయస్థానాలు విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేవని వ్యాఖ్య

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని ధర్మాసనం స్పష్టం

పిల్‌లో జోక్యం చేసుకోవడానికి కారణం కనిపించలేదని తీర్పు

కుల గణన అంశంపై మరోసారి చర్చకు తెరలేపిన తీర్పు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

జనగణనలో కుల గణనను మినహాయించేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కుల ఆధారిత జనగణన సమాచారాన్ని సేకరిస్తే ఏజెన్సీలు దానిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని పేర్కొంటూ దాఖలైన ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ..మిగతా 2లో

# మెడికల్ షాపుల బంద్..

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ఆన్‌లైన్ ఫార్మసీలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఔషధ దుకాణాల బంద్

ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్, తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసనలు

తెలంగాణలో మూతపడ్డ 25 వేలకుపైగా మెడికల్ షాపులు

హైదరాబాద్‌లో బంద్ లో పాల్గొన్న 12 వేల మందుల దుకాణాలు

అత్యవసర మందుల కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు ఫార్మసీలు తెరిచి ఉంచాలని ఆదేశాలు

మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ఆదేశాలు

అపోలో, మెడ్‌ప్లస్ వంటి కార్పొరేట్ స్టోర్లకు సేవలు కొనసాగించాలని సూచన

అత్యవసర మందుల కోసం టోల్ ఫ్రీ నంబర్ విడుదల

ఈ-ఫార్మసీల నియంత్రణపై కేంద్రం స్పష్టమైన విధానం తీసుకురావాలని డిమాండ్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దేశవ్యాప్తంగా ఈఫార్మసీలకు వ్యతిరేకంగా ఔషధ వ్యాపారులు చేపట్టిన బంద్ ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపించింది. ఆన్‌లైన్ ఫార్మసీల (ఈఫార్మసీ) ద్వారా జరుగుతున్న ఔషధ విక్రయాలను నిరసిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్, తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు మూతపడ్డాయి. తెలంగాణలో దాదాపు 25 వేలకుపైగా మెడికల్ దుకాణాలు బంద్‌లో పాల్గొన్నట్లు వ్యాపార సంఘాలు తెలిపాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే సుమారు 12 వేల ఔషధ దుకాణాలు తెరుచుకోలేదు. దీంతో సాధారణ ప్రజలు, ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, అత్యవసర మందులు అవసరమైన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈఫార్మసీల వల్ల సంప్రదాయ మెడికల్ షాపుల వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వ్యాపార సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా నియంత్రణ లేకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయని, నకిలీ ఔషధాలు మార్కెట్లోకి వచ్చే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే ..మిగతా 2లో




# జలమండలి జీఎంకు 14 రోజుల రిమాండ్

మొదటిపేజీ తరువాయి

అరెస్ట్ చేశారు. ఆయనను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.
ఏసీబీ హైదరాబాద్ సీఐయూ విభాగం డీఎస్పీ మాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామునే మల్లాపూర్ వెంకటరమణ కాలనీలోని ఆయన నివాసంపై దాడులు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు.
ఈ సోదాల్లో భారీగా అక్రమ ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇంట్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి వస్తువులు గుర్తించినట్లు సమాచారం. లెక్కింపు యంత్రాన్ని తీసుకురావాల్సిన పరిస్థితి కూడా ఏర్పడినట్లు వెల్లడించారు.
ప్రాథమిక అంచనాల ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.5.88 కోట్లుగా గుర్తించగా, బహిరంగ మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.
సీజ్ చేసిన ఆస్తుల జాబితాలో రూ.1.10 కోట్లు నగదు, 2.1 కిలోల బంగారు ఆభరణాలు, 9.2 కిలోల వెండి వస్తువులు, సంగారెడ్డి-నిజామాబాద్ జిల్లాల్లో 18 ఎకరాల భూమి, హైదరాబాద్‌లో 6 ఇళ్ల స్థలాలు, ఒక ఖరీదైన ఇల్లు, అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలో 3 ఫ్లాట్లు ఉన్నట్లు సమాచారం. అదనంగా మారుతి రిట్జ్ కారు, బజాజ్ మోటార్ సైకిల్ కూడా స్వాధీనం చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసుతో జలమండలిలో అవినీతి వ్యవహారాలపై మరోసారి చర్చ మొదలైంది. ఏసీబీ అధికారులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.





# నెట్ జీరో సిటీగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'..

మొదటిపేజీ తరువాయి

కీలక ఆదేశాలు జారీ చేశారు.

**నెట్ జీరో డిజైన్లు.. అంతర్జాతీయ ప్రమాణాలు**

ఫ్యూచర్ సిటీ డిజైన్లు పూర్తిగా పర్యావరణహితంగా, 'నెట్ జీరో సిటీ' (Net Zero City) తరహాలోనే ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఇక్కడి మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని, ఇందులో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నగరంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (Trunk Infrastructure) అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు జరపాలని చెప్పారు. వచ్చే జూన్ నెలలోనే ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగేలా చూడాలని సీఎం టార్గెట్ పెట్టారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, మరియు జర్నలిస్టుల కోసం 500 ఎకరాలను కేటాయించనున్నట్లుగా సీఎం వెల్లడించారు.

**ప్రధాని మోడీని కలుద్దాం..**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'హెల్త్ క్లస్టర్' భారత్ ఫ్యూచర్ సిటీకే వచ్చేలా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే తానే స్వయంగా ప్రధాని మోడీని కలిసి, రాష్ట్రానికి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తానని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక సెల్, అత్యాధునిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా తోడ్పాటు నందించేందుకు గ్రూప్ 1 స్థాయి అధికారితో 'ఎస్కార్ట్ ఆఫీసర్' వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో 1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌తో పాటు ద్వితీయ శ్రేణి నగరాలకూ ఐటీ రంగాన్ని విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# మెట్రో విస్తరణకు కేంద్రానికి అభ్యంతరం లేదు

- **కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**
- **162 కిలోమీటర్ల మెట్రో విస్తరణ ప్రతిపాదనలపై కేంద్ర పరిశీలన**
- **కేంద్ర–రాష్ట్ర సమాన భాగస్వామ్యంతో మెట్రో ప్రాజెక్టు ముందడుగు**
- **హైదరాబాద్ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్రాల కీలక చర్చలు**
- **మూసీ ప్రక్షాళనకు భారీ స్థాయి ఎస్‌టీపీ ప్రాజెక్టుల మంజూరు**
- **39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లతో నది కాలుష్య నియంత్రణ లక్ష్యం**
- **రూ.3,975 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 ప్రాజెక్టుల రూపకల్పన**
- **రోజుకు 972 ఎంఎల్డీ మురుగు నీటి శుద్ధి సామర్థ్యం ఏర్పాటు**
- **మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర సూత్రప్రాయ అంగీకారం**
- **నగర మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికపై దృష్టి**
- **హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నగర మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య వ్యవస్థ బలోపేతం, ప్రజారవాణా విస్తరణపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఉత్తరాదిన్యాయ శాఖ సహాయ మంత్రి జీ కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌కు సంబంధించిన పలు ప్రధాన ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు.
ముఖ్యంగా మూసీనది ప్రక్షాళన, మెట్రో రెండో దశ విస్తరణ, మురుగు నీటి శుద్ధి వ్యవస్థ అభివృద్ధి, నగర పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కేంద్రం అమృత్ 2.0 పథకం కింద హైదరాబాద్‌కు భారీ స్థాయి ప్రాజెక్టులను మంజూరు చేయడం నగర అభివృద్ధికి కీలక మలుపు అని ఆయన పేర్కొన్నారు.
ఈ సమావేశంలో మూసీనది కాలుష్య నియంత్రణ ప్రధాన అంశంగా నిలిచింది. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి మూసీలోకి చేరుతున్న మురుగు నీటిని పూర్తిగా శుద్ధి చేయాలనే లక్ష్యంతో మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీలు) మంజూరు చేసినట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.3,975 కోట్లుగా అంచనా వేయబడింది.
ఈ ఎస్‌టీపీల ద్వారా రోజుకు సుమారు 972 మిలియన్ లీటర్ల (ఎంఎల్డీ) మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఏర్పడనుంది. దీని ద్వారా మూసీ నదిలో కలుషిత నీటి ప్రవాహం గణనీయంగా తగ్గి, నది పునరుద్ధరణకు దారి తీస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నగర పర్యావరణ సమతుల్యత, భూగర్భ జలాల పరిరక్షణకు ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయి.
మెట్రో రైలు రెండో దశ విస్తరణపై కూడా సమావేశంలో సానుకూల చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 162 కిలోమీటర్ల విస్తరణ ప్రతిపాదనలపై కేంద్రం సూత్రప్రాయంగా సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. డీపీఆర్ (వివర ప్రాజెక్టు నివేదిక) అందిన వెంటనే తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్ స్పష్టం చేసినట్లు తెలిసింది.
మెట్రో ప్రాజెక్టులో కేంద్రం, రాష్ట్రం సమానంగా వ్యయభారం పంచుకునే విధంగా ముందుకు సాగేందుకు సూత్రప్రాయ అంగీకారం వ్యక్తమైనట్లు సమాచారం. దీని ద్వారా నగరంలో రవాణా వ్యవస్థ మరింత విస్తరించి, ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.
హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రహదారి రవాణా, మెట్రో కనెక్టివిటీ, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై సమగ్ర అభివృద్ధి అవసరమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0, స్మార్ట్ సిటీస్ వంటి పథకాల ద్వారా ఇప్పటికే నగరానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని సమావేశంలో ప్రస్తావించారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం పారిశుద్ధ్య కార్యక్రమం మాత్రమే కాకుండా నగర పర్యావరణ పునరుద్ధరణకు మైలురాయిగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు. కాలుష్య నియంత్రణతో పాటు నది పరివాహక ప్రాంతాల అభివృద్ధి, గ్రీన్ జోన్ల విస్తరణకు కూడా ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.
హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ పూర్తయితే నగరంలోని ప్రధాన ప్రాంతాలు మరింత వేగంగా అనుసంధానమవుతాయి. ఐటీ కారిడార్, పాత నగరం, శివారు ప్రాంతాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రవాణా నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కేంద్ర మంత్రి ఖట్టర్ స్పష్టం చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ఈ అభివృద్ధి కార్యక్రమాలు నగర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# జనగణనలో కుల గణన వద్దని ఆదేశించలేం

మొదటిపేజీ తరువాయి

విచారణ జరిపింది.
విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అంశం విధానపరమైన నిర్ణయానికి సంబంధించినదని స్పష్టం చేసింది. జనగణనలో కుల గణన ఉండాలా లేదా అనేది ప్రభుత్వ విధాన నిర్ణయ పరిధిలోకి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. వెనుకబడిన తరగతుల (బీసీ) జనాభా ఎంత ఉందో ప్రభుత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం పిల్‌లో జోక్యం చేసుకోవడానికి తగిన కారణాలు కనిపించడం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. జనగణన విధానం, దాని పరిధి, డేటా సేకరణ వంటి అంశాలు పూర్తిగా కార్యనిర్వాహక, విధాన నిర్ణయాలకు సంబంధించినవని కోర్టు స్పష్టం చేసింది.
ఈ పిల్‌లో ప్రధానంగా కుల ఆధారిత జనగణన చేపట్టడం వల్ల సేకరించిన సమాచారాన్ని కొన్ని సంస్థలు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని పిటిషనర్ వాదించారు. అందుకే జనగణనలో కుల వివరాలను సేకరించకుండా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే ఈ వాదనను కోర్టు స్వీకరించలేదు.
సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కుల గణన అంశం మరోసారి చట్టపరమైన చర్చకు కేంద్రబిందువుగా మారింది. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో న్యాయస్థానాల జోక్యం పరిమితమని, ప్రజా విధానానికి సంబంధించిన అంశాలను కార్యనిర్వాహక శాఖే నిర్ణయించాల్సి ఉంటుందని ఈ తీర్పు ద్వారా మరోసారి స్పష్టమైంది.

# తెలంగాణలో విద్య, మౌలిక వసతులకు సహకరించండి

మొదటిపేజీ తరువాయి

కేంద్రాన్ని కోరారు.
భేటీ సందర్భంగా భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించేందుకు కేంద్రం నుంచి అదనపు ఆర్థిక మద్దతు అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.
రాష్ట్రంలో పెద్ద ఎత్తున మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతోందని, ఈ నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని భట్టి తెలిపారు. గతంలో ప్రత్యేక ప్రయోజన సంస్థల (SPV) ద్వారా తీసుకున్న అప్పుల కారణంగా వాటి తిరుగుబాట్ల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఇక రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా రంగ అభివృద్ధి కార్యక్రమాలను కూడా భట్టి విక్రమార్క వివరించారు. "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. విద్యారంగాన్ని ఆధునీకీకరించేందుకు పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమాల కోసం మొత్తం రూ.30,000 కోట్ల భారీ పెట్టుబడి ప్రణాళిక రూపొందించినట్లు ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థల అభివృద్ధితో పాటు డిజిటల్ మౌలిక వసతుల బలోపేతానికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.
ఈ భారీ విద్యా ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అయితే ఈ స్థాయి పెట్టుబడులకు రాష్ట్రానికి కేంద్ర సహకారం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ఎఫ్ఆర్‌బీఎం పరిమితులలో సడలింపు ఇవ్వాలని కూడా ఆయన కేంద్రాన్ని కోరారు. సాస్కీ (SASCI) పథకం కింద ప్రత్యేకంగా రూ.5,000 కోట్ల ఆర్థిక సాయం ఇవ్వాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు ఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి అవసరాలు, కేంద్ర సహకారం వంటి అంశాలపై జరిగిన ఈ భేటీ కీలకంగా మారింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. మొత్తం మీద తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యాలను వేగవంతం చేయడానికి కేంద్రం నుంచి మరింత ఆర్థిక సహకారం కోరుతూ ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర భవిష్యత్ ప్రాజెక్టుల అమలులో కేంద్ర సహాయం కీలక పాత్ర పోషించనుంది.

# విచారణకు సహకరిస్తున్నా.. అందుకే నా కుమారుడిని అప్పగించా

మొదటిపేజీ తరువాయి

అన్నదేనని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీలో ప్రతి కార్యకర్త సుశిక్షితుడని, పార్టీ సిద్ధాంతాల పట్ల అచంచల నిబద్ధతతో పనిచేస్తారని ఆయన అన్నారు.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. పార్టీ కార్యకర్తల త్యాగం, క్రమశిక్షణపై ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన, బీజేపీ అనేది కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాకుండా ఒక సిద్ధాంతం ఆధారంగా నడిచే సంస్థ అని వ్యాఖ్యానించారు. కార్యకర్తల కట్టుబాటు, ప్రజాసేవ పట్ల వారి అంకితభావం పార్టీ బలాన్ని పెంచుతోందని తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన ప్రత్యర్థి పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. కేసీఆర్‌కు లోక్‌సభలో ఒక్క ఎంపీ కూడా లేరని, ఫామ్‌హౌస్‌లో కూర్చుని వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన విమర్శించారు. రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ పాత్రను తగ్గించి చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ వాస్తవానికి అవినీతి వ్యవస్థను కూల్చినది తమ పార్టీయేనని ఆయన పేర్కొన్నారు.
"ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది మేమే. కుటుంబ పాలనను అంతం చేసింది కూడా మేమే" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో గతంలో ఉన్న కుటుంబ ఆధిపత్య పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని, ఆ అసంతృప్తిని బీజేపీ రాజకీయంగా ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు.
మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ ఆయన మరింత స్పష్టత ఇచ్చారు. తనపై ఇతర పార్టీల నేతలు బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని అడిగినప్పుడు, ఆయన తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలు సహజమని, కానీ అవి వాస్తవాలను మార్చలేవని ఆయన అన్నారు. తనపై వస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని పేర్కొన్నారు.
తన కుటుంబానికి సంబంధించిన అంశాలపై కూడా ఆయన స్పందించారు. తన కుమారుడి వ్యవహారంపై వచ్చిన ప్రశ్నలకు సమాధానంగా, "విచారణకు సహకరించాలనే ఉద్దేశంతోనే నా కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించాను" అని తెలిపారు. ఇందులో దాచాల్సిన అంశం ఏమీ లేదని, చట్ట ప్రక్రియకు పూర్తిగా సహకరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయ విమర్శలతో కలిపి చూడటం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుత రాజకీయ చర్చలు వ్యక్తిగత విమర్శల వైపు మళ్లుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు.
బీజేపీ కార్యకర్తల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా చర్చకు దారితీశాయి. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాల కోసం కట్టుబడి పనిచేస్తాడని, ఇది ఇతర పార్టీలతో పోలిస్తే బీజేపీకి ఉన్న ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండే భావజాలం కార్యకర్తల్లో ఉందని ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ మీడియా సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసింది. బండి సంజయ్ వ్యాఖ్యలు ఒకవైపు బీజేపీ కార్యకర్తల ఉత్సాహాన్ని పెంచేలా ఉన్నప్పటికీ, మరోవైపు ప్రతిపక్ష పార్టీలపై తీవ్ర విమర్శల కారణంగా రాజకీయ ఉద్రిక్తతను పెంచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి బీజేపీ-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసేలా కనిపిస్తున్నాయి.



# మెడికల్ షాపుల బంద్..

మొదటిపేజీ తరువాయి

మందులు విక్రయించడం ప్రజారోగ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మసీ వ్యాపారుల బంద్ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. బుధవారం రోజంతా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫార్మసీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు సహా అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో 24 గంటల పాటు మెడిసిన్ కౌంటర్లు తెరిచి ఉంచాలని మంత్రి ఆదేశించారు. అత్యవసర ఔషధాల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు.
ఇక రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి (డీసీఏ) కూడా అప్రమత్తమైంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు డీసీఏ డైరెక్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన చోట్ల ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా అపోలో, మెడ్‌ప్లస్ వంటి కార్పొరేట్ మెడికల్ స్టోర్ నిర్వాహకులు దుకాణాలు తెరిచి ఉంచాలని ప్రభుత్వం కోరింది. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కనీస సేవలు కొనసాగించాలని సూచించింది. కొన్ని కార్పొరేట్ ఔషధ దుకాణాలు పరిమిత స్థాయిలో సేవలు అందించినట్లు సమాచారం. అత్యవసర మందులు అవసరమైన ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 18005996969కు సంప్రదించాలని అధికారులు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో మందుల సరఫరా కోసం ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.
ఫార్మసీ వ్యాపార సంఘాల వాదన ప్రకారం, ఈఫార్మసీలు భారీ డిస్కౌంట్లతో మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి. చిన్న, మధ్య తరహా మెడికల్ షాపులు మూతపడే పరిస్థితి ఏర్పడుతోందని వారు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ ఔషధ దుకాణాలే ప్రజలకు ప్రధాన ఆధారమని, వాటి మనుగడకు ముప్పు ఏర్పడితే ఆరోగ్య రంగంపైనా ప్రభావం పడుతుందని అంటున్నారు. మరోవైపు డిజిటల్ సేవలను ప్రోత్సహించే వర్గాలు మాత్రం ఈఫార్మసీల ద్వారా మందులు ఇంటికే చేరడం వల్ల ప్రజలకు సౌకర్యం పెరిగిందని చెబుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇది ఉపయుక్తమని అభిప్రాయపడుతున్నాయి. అయితే నియంత్రణ వ్యవస్థ మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. దేశవ్యాప్తంగా కొనసాగిన ఈ బంద్ ఔషధ రంగంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వ్యాపారాల మధ్య పెరుగుతున్న పోటీని మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈఫార్మసీలపై స్పష్టమైన విధానం తీసుకురావాలని ఫార్మసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్

- ఉద్యోగ నియామకాల వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నేత కోళ్ల వెంకటేష్ కృతజ్ఞతలు

**వనపర్తి,మే 20 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించిందని కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండీ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల వయోపరిమితిని 34 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా కోళ్ల వెంకటేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత అభ్యర్థన మేరకు ప్రభుత్వం స్పందించి,వయోపరిమితి సడలింపుపై మే 18,2026న జీవో నెంబర్ 86 విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఏర్పడిందని తెలిపారు.

**బీఆర్ఎస్‌పై విమర్శలు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని కోళ్ల వెంకటేష్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యువత ఆత్మబలిదానాలు చేసినా, అప్పటి ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంలో విఫలమైందన్నారు. మాజీ సీఎం కే. చంద్రశేఖర్ రావు పాలనలో నిరుద్యోగులకు న్యాయం జరగలేదని ఆరోపించారు.




**సంక్షేమ పాలనకు నిదర్శనం**

ప్రస్తుత ఇందిరమ్మ ప్రజాపాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని కోళ్ల వెంకటేష్ పేర్కొన్నారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న మానవీయ దృక్పథం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షుడు ఎల్లన్న,యువ నాయకులు ఎంట్ల రవి యాదవ్, మండ్ల దేవన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## కోఆప్షన్ సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర నియోజకవర్గం మే 20 (ప్రజాక్షేత్రం):**

నూతనంగా కోఆప్షన్ సభ్యులుగా నియామకమైన కోరే పవన్ కుమార్,లావణ్య,తన్వీర్ సుల్తానా,అఫ్రోజ్ కు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలకు బీమా కల్పించాలి

- 210 రోజుల పని,రూ.600 కూలి ఇవ్వాలి
- అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**ఆత్మకూర్ మే20(ప్రజాక్షేత్రం):**

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం కల్పించడంతో పాటు సంవత్సరానికి 210 రోజుల పని ఇచ్చి రోజుకు రూ.600 కూలి చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండలం పరిధిలోని బాలకిష్టాపూర్ గ్రామం శివారులో నిర్వహించిన ఉపాధి కూలీల సభలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని కార్మిక సంఘాల పోరాట ఫలితంగా సాధించుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. పేరు మార్పులతో కూలీల జీవితాల్లో మార్పు రాదని, పనికి తగిన వేతనం ,పని దినాల పెంపు,బీమా సౌకర్యం,వారం వారీగా బిల్లుల చెల్లింపు, పనిస్థలాల్లో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు రూ.12 వేల జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. గత సంవత్సరం కొంతమందికి మాత్రమే రూ.6 వేల చొప్పున చెల్లించి, మిగిలిన వారికి ఇంకా అందలేదన్నారు. కూలీలకు రావాల్సిన రూ.18 వేల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవన భృతి ఎంపికలో అనేక లోపాలు ఉన్నాయని, రెండు ఎకరాల భూమి కలిగిన వ్యవసాయ కూలీలను కూడా అర్హులుగా గుర్తించాలని కోరారు. జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులుగా గుర్తింపు పొందిన ప్రతి కూలీకి జీవన భృతి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.



## మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా ను కలసి కృతజ్ఞతలు తెలియజేసిన ఎస్. సుబ్రహ్మణ్యం.

**బంగారుపాలెం మే 20(ప్రజాక్షేత్రం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం స్థానిక వైయస్సార్సీపి నేతగా జిల్లా ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా ఎస్. సుబ్రహ్మణ్యం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందున సందర్భంగా బుధవారం ఎం బి కుమార్ రాజా స్వగృహమునందు మర్యాదపూర్వకంగా తన అనుచరులతో కలవడం జరిగింది. ఎం బి కుమార్ రాజా కు శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. తనకు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవి రావడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కే సుబ్రహ్మణ్యం, ఎన్ వాసు,కే బాలకృష్ణయ్య,ఎన్ గోపి,కే బి నవీన్,టీజే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మిట్టపల్లి లో ఘనంగా అర్జునుడి తపస్సు

**బంగారుపాల్యం మే 20(ప్రజాక్షేత్రం):**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం మిట్టపల్లి గ్రామంలో సుమారు 150 సంవత్సరాలు చరిత్ర కలిగిన వెలసిన శ్రీద్రౌపతి అమ్మవారి దేవస్థానం వద్ద జరిగే మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.అర్జున పాత్రధారి మెట్టు మెట్టు తపస్సు మాను ఎక్కుతూ తన పాటలు పద్యాలతో భక్తులను అలరించారు. బిడ్డలు లేని మహిళలు బిడ్డల కోసం తడి బట్టలతో వరం కోరుకోవడం జరిగింది.ఈ అర్జున తపస్సు కార్యక్రమానికి ఉభయధారులుగా సంక్రాంతిపల్లి మాజీ సర్పంచ్ జయచంద్ర వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.అర్జున పాత్రధారి విసిరే విభూది,నిమ్మపండు,బొరుగులు,అరటిపండు కోసం భక్తులు ఎగబడ్డారు.ఈ కార్యక్రమంలో 7గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఆలయ కమిటీ మెంబర్లు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి

- 130వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి,మే 20 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు,బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాప్‌రెడ్డి 130వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వనపర్తిలోని తన నివాసంలో సాహితీవేత్తలతో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. సురవరం ప్రతాప్‌రెడ్డి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడం ద్వారా సమాజానికి స్ఫూర్తినిచ్చే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. సాహితీవేత్తగా,న్యాయవాదిగా, మేధావిగా,జర్నలిస్టుగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సామాజిక రుగ్మతలకు ఎదురొడ్డి నిలిచిన మహనీయుడు సమాజంలో ఉన్న అన్యాయాలు, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా సురవరం ప్రతాప్‌రెడ్డి పోరాడారని నిరంజన్‌రెడ్డి కొనియాడారు. తన రచనల ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన మహానుభావుడని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ దళిత దండోరా వంటి ఉద్యమాలకు అండగా నిలిచిన అపర మేధావి అని అభివర్ణించారు. గోల్కొండ పత్రికతో జర్నలిజానికి మార్గదర్శి గోల్కొండ పత్రికను స్థాపించి జర్నలిజం రంగానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. సురవరం పేరు చిరస్థాయిగా నిలిచేలా గ్రంథాలయం, పార్కులో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. జయంతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సాహితీవేత్తలు, విద్యావేత్తలు, ప్రజా చైతన్యం కలిగినవారు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా పలువురు మేధావులు జయంతి ఉత్సవాలకు సురవరం జీవితంపై పరిశోధనలు చేసిన గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబు,సాగునీటి రంగ నిపుణుడు శ్రీధర్‌రావు దేశ్‌పాండే, తెలంగాణ అస్తిత్వవాదం, సామాజికరాజకీయ అంశాలపై విశ్లేషకుడు,ఉద్యమకారుడు వి. ప్రకాశ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, సాహితీవేత్తలు వీరయ్య, బలరామ్,బైరోజు చంద్రశేఖర్, కిరణ్,తిరుమలేశ్,జోహెబ్ హుస్సేన్,కుమార్,తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ సేవా సంఘానికి మళ్లీ అశ్విని రమేష్ నాయకత్వం

- వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక

**వనపర్తి,మే 20 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఉత్సాహభరితంగా జరిగాయి. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు సీతారాములు, నందకుమార్, పాండు తదితరులు హాజరై ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.


ఈ సందర్భంగా వనపర్తి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశ్విని రమేష్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎ. ప్రసాద్ (కొత్తకోట) ఎన్నుకున్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

**సభ్యుల విశ్వాసమే నాకు బలం**
**అశ్విని రమేష్**

రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అశ్విని రమేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి కోసం సభ్యుల సహకారంతో మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. "మీరు ఇచ్చిన ప్రోత్సాహం, ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నాయి. జిల్లాలోని ప్రతి మండలంలో సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతకు ప్రాధాన్యం కల్పిస్తూ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతాం" అని అన్నారు. నాయి బ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సంఘ సభ్యుల ఐక్యతతోనే మరింత ముందుకు సాగగలమని ఆయన పేర్కొన్నారు.

**సంఘ నాయకుల అభినందనలు**

ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అశ్విని చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి బిక్కం రాజు, మాదాపురం కృష్ణయ్య, సదుర్ల నాగరాజు, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు సాయిబాబా చిదంబరం తదితర నాయకులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి సభ్యుల సంక్షేమం కోసం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.కార్యక్రమానికి జిల్లా నుండీ సంఘ సభ్యులు హాజరై విజయవంతం చేశారు.



## శ్మశానవాటిక, ఆశూర్ ఖానాపై అక్రమ కబ్జా

**జహీరాబాద్ మే 20 (ప్రజాక్షేత్రం):**



న్యాల్‌కల్ మండలం రుక్మాపూర్ గ్రామంలో కొన్ని రోజుల క్రితం ఒక వెంచర్ నిర్వాహకులు కొన్ని సమాధులను, ఆశూర్ ఖానాను కూల్చివేసి, ఆ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నించారు. బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ తక్షణ స్పందన ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ తక్షణమే స్పందించారు: వక్ఫ్ బోర్డ్ సీఈఓతో మాట్లాడిన ఒవైసీ: ఆయన తెలంగాణ వక్ఫ్ బోర్డ్ సీఈఓ (CEO) తో మాట్లాడి, ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక నాయకత్వానికి ఆదేశాలు: జహీరాబాద్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అథర్ అహ్మద్‌తో ఫోన్‌లో మాట్లాడి, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఘటన స్థల పరిశీలన తహశీల్దార్‌కు ఫిర్యాదు మజ్లిస్ అధ్యక్షుడు మహమ్మద్ అథర్ అహ్మద్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సాబిర్ హుస్సేన్ కలిసి రుక్మాపూర్ గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వారు న్యాల్‌కల్ మండలం తహశీల్దార్‌ను కలిసి చర్చించారు: లిఖితపూర్వక ఫిర్యాదు: ఘటనపై తహశీల్దార్‌కు అధికారికంగా లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. జాయింట్ సర్వేకు డిమాండ్: వక్ఫ్ బోర్డు మరియు రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సదరు భూమిపై జాయింట్ సర్వే (ఉమ్మడి సర్వే) నిర్వహించాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ హామీ: తహశీల్దార్ స్పందిస్తూ.. వీలైనంత త్వరలోనే రెండు శాఖల అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. పోలీసులకు ఫిర్యాదు కఠిన చర్యలకు డిమాండ్ తహశీల్దార్‌తో సమావేశం అనంతరం, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ సాబిర్ హుస్సేన్,మజ్లిస్ అధ్యక్షుడు మహమ్మద్ అథర్ అహ్మద్ కలిసి హద్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) ను కలిశారు. "పవిత్ర స్థలాలు, వక్ఫ్ భూములను ధ్వంసం చేసి, అక్రమ కబ్జాలకు పాల్పడిన నిందితులపై చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవాలి" అని వారు పోలీసులను డిమాండ్ చేశారు. ప్రతినిధి బృందంలో పాల్గొన్న వీరితో పాటు షేక్ ఇలియాస్ (జాయింట్ సెక్రటరీ) ఫర్హాన్ ఖాద్రీ ఆసిఫ్ (హద్నూర్) యూనుస్ వక్ఫ్ బోర్డు అధికారిక సర్వేయర్ మరియు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

- వనపర్తి టీడీపీ కార్యాలయంలో అభిమానుల సందడి

**వనపర్తి,మే 20(ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో బుధవారం గ్లోబల్ స్టార్ జూనియర్ యన్ టి రామారావు జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు.

నందమూరి కుటుంబ వారసుడిగా సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కాగితాల లక్ష్మయ్య మాట్లాడుతూ యుగ పురుషుడు యన్ టి రామా రావు మనవడిగా, నందమూరి హరికృష్ణ వారసుడిగా సినీ రంగంలో అడుగుపెట్టిన జూనియర్ ఎన్టీఆర్ నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన గ్లోబల్ స్టార్‌గా ఎదిగారని కొనియాడారు. తన నటన, క్రమశిక్షణ,కష్టపడే తత్వంతో కోట్లాది అభిమానుల మనసులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ భారతీయ సినీ పరిశ్రమలో మరింత ఖ్యాతి గడించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అభిమానులు ఆకాంక్షించారు. అభిమానులు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు ఆవుల శ్రీను, అప్పాయిపల్లి బాలయ్య,డి. బాలరాజ్,కొత్త గొల్ల శంకర్,డి. శివాజీ,సాయికుమార్,గంధం కృష్ణయ్య,వీరాచారి తదితరులు పాల్గొన్నారు.అభిమానుల హర్షధ్వానాలతో టీడీపీ కార్యాలయం సందడిగా మారింది.



# ఒక ఫోన్ కాల్‌తో గడప వద్దకే పోలీసు సేవలు

- ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో ప్రజలకు తక్షణ న్యాయం
- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- బాధితుల వద్దకే చేరుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్న వనపర్తి పోలీసులు
- మహిళలు,చిన్నారులు, వృద్ధులకు మరింత భరోసా
- డయల్-100కు కాల్ చేస్తే వెంటనే స్పందన



**వనపర్తి,మే 20 (ప్రజాక్షేత్రం):**

ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో వనపర్తి జిల్లా పోలీసులు "ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్" విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి బుధవారం తెలిపారు. ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా,సంఘటన జరిగిన ప్రదేశానికే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నామని వెల్లడించారు. ఈ విధానం ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన,నమ్మకమైన పోలీసు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ "ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్" విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో బాధితుల వద్దకే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు కేసుల దర్యాప్తు మరింత వేగవంతంగా జరుగుతోందన్నారు.మహిళలపై దాడులు, చిన్నారులపై నేరాలు,రోడ్డు ప్రమాదాలు,దొంగతనాలు, గొడవలు,మిస్సింగ్ కేసులు,లైంగిక వేధింపులు,బాల్య వివాహాలు, ర్యాగింగ్ ఘటనలు వంటి కేసుల్లో ఈ సేవ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు,గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ విధానం ఎంతో మేలు చేస్తోందని చెప్పారు.

అత్యవసర పరిస్థితుల్లో బాధితులు డయల్ 100కు లేదా సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి చర్యలు ప్రారంభిస్తారని ఎస్పీ తెలిపారు.ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

**మైనర్ బాలికకు ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో వేగవంతమైన న్యాయం**

ఇటీవల వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హాస్టల్‌లో చదువుకుంటున్న మైనర్ బాలికను హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వేధింపులకు గురిచేస్తున్న ఘటనలో "ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్" విధానం ద్వారా పోలీసులు వెంటనే స్పందించారు. బాధిత బాలిక డయల్ 100కు సమాచారం అందించగా, పోలీసులు నేరుగా హాస్టల్‌కు చేరుకుని ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం వెంటనే కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన "ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్" విధానం బాధితులకు ఎంత వేగంగా భరోసా కల్పిస్తుందో చూపించే ఉదాహరణగా నిలిచిందన్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ సునిత రెడ్డి స్పష్టం చేశారు.

# కార్యకర్తల సంక్షేమమే మా ధ్యేయం

- తట్టు నారాయణ (టిఎన్ఆర్ )
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి

**జహీరాబాద్ మే 20 (ప్రజాక్షేత్రం):**

నియోజకవర్గ శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు జహీరాబాద్ మండల పరిధిలోని అల్గోల్,కొత్తూరు ( బి ),తుమ్ కుంటా,అర్జున్ నాయక్ తాండ, మల్చల్మా తాండ గ్రామాలకు సంబంధించిన ఎనిమిది చెక్కులకు గాను మొత్తం 1,02,000 /లక్ష రెండు వేయిల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ మండల సర్పంచులు మరియు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు మచ్చేందర్,చల్లా శ్రీనివాస్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి, రాజు,మల్లికార్జున్,వెంకట్, మోహన్ రాథోడ్,జనార్దన్ రెడ్డి,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హీరు రాథోడ్,మాజీ సర్పంచులు, జగదీశ్,చిన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సీఈఐఆర్‌తో ట్రేస్ చేసిన సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత

**కరీంనగర్,మే 20 (ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన వోల్లల శివకుమార్ బొమ్మకల్‌లోని ఎస్ఎఫ్ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద తన ఓపో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,పోలీసులు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఫోన్‌ను ట్రేస్ చేశారు. హుస్నాబాద్‌లో గుర్తించిన ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడు శివకుమార్‌కు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి అందజేశారు. సెల్‌ఫోన్ ట్రేసింగ్‌లో కీలకంగా పనిచేసిన టెక్ టీం కానిస్టేబుళ్లు రాంసాయి,సుప్రియలను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.




# చొప్పదండిలో మట్టి దందా ఆరోపణలు

- చెరువుల తవ్వకాలపై బీఆర్ఎస్ ఆందోళన
- ఎమ్మెల్యే అండతోనే అక్రమాలు జరుగుతున్నాయన్న సుంకె రవిశంకర్
- విలేకరులకు బెదిరింపులపై ఆగ్రహం

**కరీంనగర్,మే 20 (ప్రజాక్షేత్రం):**

చొప్పదండి నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని, అధికార పార్టీ నేతల అండదండలతో చెరువులను అడ్డగోలుగా తవ్వేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. గంగాధర మండలం కురిక్యాల చెరువును బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన అక్రమ మట్టి తవ్వకాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రామడుగు,గంగాధర,చొప్పదండి, బోయినిపల్లి మండలాల్లో చెరువులు,నీటి వనరులు నాశనమవుతున్నాయని అన్నారు.నీటి పారుదల,మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తోందని విమర్శించారు.

అరకొర అనుమతులతో వందల లారీల్లో మట్టిని తరలిస్తున్నారని, కోట్ల రూపాయల దందా జరుగుతున్నా అధికారులు కళ్లు మూసుకుని కూర్చున్నారని ఆరోపించారు.చెరువులను కాపాడాల్సిన వారే మాఫియాకు అండగా నిలుస్తున్నారని మండిపడ్డారు.

స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అండతోనే ఈ తవ్వకాలు సాగుతున్నాయని సుంకె రవిశంకర్ ఆరోపించారు.అధికార పార్టీ నాయకులు,కొంత మంది అధికారులు కుమ్మక్కై ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు.అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులే లారీలను అడ్డుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. చెరువు వద్దకు వెళ్లిన విలేకరులను ఎమ్మెల్యే అనుచరులు బెదిరిస్తున్నారని కూడా ఆయన ఆరోపించారు. "విలేకరి వస్తే చంపేస్తాం" అంటూ హెచ్చరికలు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు. గ్రామాల ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోందని విమర్శించారు. చెరువులను నాశనం చేస్తున్న మట్టి మాఫియాపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.






# వలిగొండలో మెడికల్ షాపుల యజమానుల భారీ ర్యాలీ

**వలిగొండ మే 20(ప్రజాక్షేత్రం):**

ఆల్ ఇండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు వలిగొండలో మెడికల్ షాపుల యజమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆన్లైన్ విక్రయాల వల్ల చిన్న వ్యాపారులు నష్టపోతున్నారని, నాసిరకం మందుల విక్రయాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లను నిలిపివేయాలని, జీఎస్ఆర్ 817 నోటిఫికేషన్ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# బైక్ దొంగల అరెస్ట్

- వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్, సిబ్బందిని అభినందించిన చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి

**వలిగొండ మే 20(ప్రజాక్షేత్రం):**



పలు జిల్లాలలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను వలిగొండ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి విలువైన 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ బాలాజీ నగర్ బొల్లారం ప్రాంతానికి చెందిన రాపెన్ మణికుమార్ (26) , మరో ఇద్దరు అతని స్నేహితులు (బాలు నేరస్తులు) ఒక ముఠాగా ఏర్పడి రాత్రివేళల్లో ఇంటి ఆవరణలో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను కటర్లు ఉపయోగించి హ్యాండిల్ లాకులను విరగొట్టి, ఇగ్నిషియన్ వైర్లను కట్ చేసి ద్విచక్ర వాహనాలను దొంగిలించేవారని పోలీసులు తెలిపారు వాహనాలను స్క్రాప్ దుకాణాలలో విక్రయించి వచ్చిన సొత్తును పంచుకునేవారు. నిందితుడు రాఫెన్ మణికుమార్ ను అరెస్ట్ చేసి రామన్నపేట కోర్టులో హాజరుపరచగా నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు బాల నేరస్తులు పరారీలో ఉన్నట్లు వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో కూడా వాహన చోరీ కేసుల్లో కూడా ఈ నిందితుల ప్రమేయం పై మరింత క్లుప్తంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల్లోనే కేసును చేదించి ఇతర జిల్లాల్లో కూడా చోరీలకు పాల్పడ్డ నిందితులను పట్టుకోవడంలో సఫలమైన వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ నిరంజన్,అనిల్ ను డిఎస్పి మధుసూదన్ రెడ్డి ,సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

# జిల్లావ్యాప్తంగా మూతపడిన మెడికల్ షాపులు

**కరీంనగర్,మే 20 (ప్రజాక్షేత్రం):**

ఆన్లైన్ ఫార్మసీ విధానాలకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపుతో బుధవారం కరీంనగర్ జిల్లాలో మెడికల్ షాపుల బంద్ కొనసాగింది. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోనూ అత్యవసర సేవలు మినహా చాలా వరకు మెడికల్ షాపులు మూతపడ్డాయి. ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలు పెరగడంతో సంప్రదాయ మెడికల్ షాపుల వ్యాపారం దెబ్బతింటోందని కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ మందుల చలామణి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చిన్న వ్యాపారుల జీవనోపాధి కాపాడేందుకు ప్రభుత్వం ఆన్లైన్ ఫార్మసీలపై నియంత్రణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. బంద్‌కు జిల్లావ్యాప్తంగా మంచి స్పందన లభించిందని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




# శ్రీగంధం తోట మలుపు వద్ద ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు

- ప్రజల భద్రత కోసం సోంపల్లి గ్రామపంచాయతీ ముందడుగు

**బూర్గంపాడు మే 20 (ప్రజాక్షేత్రం):**


ప్రమాదాలకు కారణమవుతున్న తుమ్మ చెట్టు
తొలగించాలని గ్రామ ప్రజల విజ్ఞప్తి
బూర్గంపాడు,మే 19 (ప్రజాక్షేత్రం):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సోంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సోంపల్లి నుండి బూర్గంపాడు వెళ్ళే రోడ్డులో శ్రీగంధం తోట సమీపంలోని ప్రమాదకర మూలమలుపు వద్ద తుమ్మ చెట్టు దట్టంగా పెరిగి ... స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో మరియు వేగంగా వచ్చే వాహనాల సమయంలో ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెట్టు కొమ్మలు రహదారిని కప్పివేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక
ప్రమాదం జరగకముందే వెంటనే స్పందించి తుమ్మ చెట్టు కొమ్మలను తొలగించి రహ


సోంపల్లి నుండి బూర్గంపహాడ్ వెళ్లే ప్రధాన రహదారిలోని శ్రీగంధం తోట మలుపు వద్ద ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను సోంపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తొలగించడం జరిగింది.వాహనదారులు, ప్రజలు సురక్షితంగా ప్రయాణించేందుకు మరియు రహదారిపై ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ పనులను చేపట్టినట్లు గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ,గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు పాలక వర్గ సభ్యులు పాల్గొని పనులను పర్యవేక్షించారు. ప్రజల భద్రత కోసం గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు పేర్కొన్నారు.




# సమ్మర్ క్యాంపులతో ప్రభుత్వ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం

- తరగతి గదులకు అతీతంగా నైపుణ్యాల పెంపు
- కరీంనగర్‌లో పీపీపీ విధానంలో వినూత్న శిక్షణ కార్యక్రమాలు

**కరీంనగర్,మే 20 (ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కరీంనగర్ జిల్లాలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు విశేష స్పందన పొందుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ప్రత్యేక చొరవతో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.మే 15 నుంచి ప్రారంభమైన 15 రోజుల సమ్మర్ క్యాంపుల్లో ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ, టీజీఎంఎస్ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. జిల్లాలోని 11 ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచితంగా శిక్షణ అందిస్తున్నాయి. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నారు. హన్మంతరావు, భావని ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తరగతుల్లో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతోందని ఉపాధ్యాయులు తెలిపారు.జిల్లా విద్యాశాఖాధికారి డా. అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు తరగతి గదులకు పరిమితం కాని అభ్యాస అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి భవిష్యత్‌కు సిద్ధం చేయడంలో ఇవి కీలకంగా మారుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను ఆమె అభినందించారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల గరిష్ట భాగస్వామ్యానికి కృషి చేయాలని సూచించారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్యాంపులను క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గంగాధర మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ రావు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపుతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ క్యాంపులు దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





## నాలుగు రోజులుగా రోడ్డుపైనే మొక్కజొన్నలు.

- **సొసైటీ సీఈవోను నిలదీసిన చిట్టెం**

**నర్వ, మే 20(ప్రజాక్షేత్రం ):**

నర్వ మండల సొసైటీ వద్ద రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన మొక్కజొన్నలు నాలుగు రోజులుగా రోడ్డుపైనే ఉండటంపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఫిర్యాదుతో వెంటనే సొసైటీ వద్దకు చేరుకున్న ఆయన సొసైటీ సీఈవో ఉదయ్‌ను నిలదీశారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా రోజుల తరబడి రోడ్డుపైనే ఉంచడం సరైంది కాదన్నారు. ఒకవేళ వర్షం వస్తే ధాన్యం తడిసిపోతే బాధ్యత ఎవరిది. నాలుగు రోజులుగా ట్రాక్టర్ల అద్దె ఖర్చు రైతులు ఎలా భరిస్తారు..?" అని ప్రశ్నించారు. వెంటనే మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ చేపట్టి, సాయంత్రం ఐదు గంటలలోపు ఒక్క ట్రాక్టర్ కూడా అక్కడ నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి స్పందించిన సీఈవో ఉదయ్ సాయంత్రంలోపు మొక్కజొన్నలను అన్‌లోడ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, నాయకులు దండు అయ్యప్ప, మాజీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, కల్వల్ బి. ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, రాజారెడ్డి, పాతచేడు శోభన్‌బాబు, నాగరాజు, కాజా రాంపురం శంకర్, బి. కృష్ణ, గోపివద్దే లింగన్న, అశోక్ తదితర టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ఖానాపురం, మే 20(ప్రజా క్షేత్రం):**

ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన నలుగురికి రూ.62,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధరావుపేట సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి అందజేశారు. సహాయం పొందిన వారిలో గుండు సాంబయ్యకు రూ.16 వేల, పోల్కం ఉపేందర్‌కు రూ.18 వేల, షేక్ ఫర్జానాకు రూ.15 వేల, షేక్ మస్తాన్‌బీకి రూ.13,500 చెక్కులు అందించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఈ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగిడి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి షేక్ లాలు సాబ్, గ్రామ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.



## గిట్టుబాటు ధర కల్పించాలి రైతుల ఆవేదన

- **మాట్లాడుతున్న రైతులు నీరుడి శంకర్, జక్కుల రమేష్**
- **మద్దతు ధర తగ్గడంతో నష్టాల్లో రైతులు**
- **ప్రతి ఎకరాకు 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి**

**పెద్దకొడప్‌గల్ మే 20(ప్రజాక్షేత్రం):**

మండలానికి చెందిన రైతులు నీరుడి శంకర్, జక్కుల రమేష్ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది ప్రభుత్వం ఎకరాకు 14 క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి కేవలం 10 క్వింటాళ్లకే పరిమితం చేయడం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కార్మిక వ్యయాలు భారీగా పెరిగిపోయాయని, కానీ రైతులకు అందుతున్న మద్దతు మాత్రం తగ్గిపోవడం బాధాకరమన్నారు. మా యూకో నియోజకవర్గంలో జొన్నల సాగు అధికంగా జరుగుతుందని, ఎంతో మంది రైతులు జొన్న పంటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే సరైన మద్దతు ధర, పూర్తి స్థాయి కొనుగోలు లేకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పండించిన పంటకు సరైన ధర రాకపోవడంతో అప్పుల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం పూర్తిగా నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఎకరాకు కనీసం 20 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని అమలు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సన్నాహాలు

- **ప్రతి పార్టీ బూత్ స్థాయిలో ఏజెంట్ల నియామకం చేయాలి**
- **రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి సమావేశం**

**వనపర్తి, మే 20(ప్రజా క్షేత్రం):**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) షెడ్యూల్‌ను కలెక్టర్ వివరించారు. జూన్ 15 నుంచి సన్నాహక కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి 24 వరకు బూత్‌ల మ్యాపింగ్, బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల వివరాలను ధృవీకరించనున్నట్లు చెప్పారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.




రాజకీయ పార్టీల సహకారం అవసరం ప్రత్యేక సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన మరియు డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి అంశాల్లో బీఎల్‌వోలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మద్దూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పై మహిళా పోలీస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు.

**మద్దూరు మే 20(ప్రజాక్షేత్రం):**

ఎస్సై పై కేసు నమోదు అయిన ఘటన నారాయణపేట పిఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ పై తన స్నేహితురాలు, వరంగల్ కమిషనరేట్ కు చెందిన మహిళ పోలీస్ ఫిర్యాదు చేశారు. శిక్షణ సమయంలో పరిచయమై పలుమార్లు తనను మానసికంగా లైంగికంగా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు జీరో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి, కేసును వరంగల్ కు బదిలీ చేశారు. విజయ్ ను వి ఆర్ కు ఎస్పీ బదిలీ చేశారు.



## పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- **రికార్డులు పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**పెద్దకడుబూరు, మే 20(ప్రజా క్షేత్రం):**

పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులపై సమీక్ష నిర్వహించిన ఎస్పీ.. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి నేరాల నియంత్రణకు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు త్వరిత గతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, నూతన





చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కోసిగి సీఐ మంజునాథ్, పెద్దకడుబూరు ఎస్సై మారుతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాగర్ గూడలో యదేచ్చగా అక్రమ కట్టడాలు.

- **టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల అగ్రహం.**
- **అధికారుల దృష్టికితీ, సుకువచ్చిన కరువు.**
- **అనుమతులకు విరుద్ధంగా జి ప్లస్ 5నిర్మాణం.**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20(ప్రజాక్షేత్రం)**




రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని నాగర్ గూడలో అక్రమ నిర్మాణాలు యదేచ్చగా కొనసాగుతున్నాయని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ముఖ్యంగా నాగర్ కూడా జాతీయ రహదారి పక్కనే అనుమతులకు విరుద్ధంగా జి ప్లస్ 5, పెంట్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం ఎలాంటి సెల్బాక్స్ లేకుండానే భారీ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని నాగర్ గూడ వివిధ బస్తీల్లో కూడా ఇలాగే అనేక అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు, టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలు కనిపించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులకు విరుద్ధంగా కొనసాగుతున్న నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఎలాంటి అక్రమ కట్టడాలు పునారవతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆన్‌లైన్ ఆటో డ్రైవర్ మోసం

- **సీసీ కెమెరాలతో గుర్తించి ఫ్యాన్లు స్వాధీనం**

**జమ్మిగడ్డ, మే 20( ప్రజా క్షేత్రం):**


కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్‌లో బుక్ చేసిన ఆటో డ్రైవర్ మహిళను మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించి, అపహరించిన ఆరు బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మిగడ్డకు చెందిన లతా ఈ నెల 19న సీడీఎం ఆర్మీ కాంటీన్‌లో ఇంటి అవసరాల కోసం ఆరు బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్లు కొనుగోలు చేశారు. ఫ్యాన్లను వెంటనే తీసుకెళ్లలేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆటో బుక్ చేసి, రాజేంద్రనగర్‌లోని తన మరో ఇంటి చిరునామాకు తీసుకెళ్లాలని డ్రైవర్‌కు సూచించారు. అయితే ఆటో డ్రైవర్ ఫ్యాన్లను గమ్యస్థానానికి చేర్చకుండా మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని పరారయ్యాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి ఆటోను గుర్తించారు. అనంతరం హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ ప్రాంతంలో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఆరు ఫ్యాన్లను స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు.




## లేడీ ఎస్ఐ డిక్కీ ప్లాన్ రివర్స్..

**హైదరాబాద్ మే 20(ప్రజాక్షేత్రం):**

కుటుంబ వివాదాల కేసులో పోలీస్ స్టేషన్ హాజరు నుంచి మినహాయింపు ఇచ్చేందుకు రూ.30 వేలు లంచం తీసుకుంటూ బోయినపల్లి లేడీ ఎస్ఐ కిరణ్ నందిత, రైటర్ విజయకుమార్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా దొరికిపోయారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి సోమవారం పీఎస్కు వస్తున్న ఓ బాధితుడు.. తాను కొండాపూర్కు మారుతున్నందున హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరగా ఎస్ఐ కిరణ్ నందిత రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితు డు ఏసీబీని ఆశ్రయించాడు. ఇవాళ బాధితుడు డబ్బులు తీసుకురాగా, ఎస్ఐ కిరణ్ నం దిత తన చేత్తో తీసుకోకుండా తన స్కూటర్ తాళాలు ఇచ్చి డిక్కీలో పెట్టమని చెప్పింది. బాధిత్తుడు డిక్కీలో డబ్బులు పెట్టి తాళాలు తిరిగి ఎస్ఐకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఇద్దరినీ పట్టుకుని, నగదు రికవరీ చేశారు. నిందితుల్లో కిరణ్ నందిత 2024 బ్యాచ్ ఎస్ఐ కాగా, విజయ్కుమార్ 2007 బ్యాచ్ కానిస్టేబుల్ అని ఏసీబీ తెలిపింది.



## బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ వైన్స్ షాప్ వద్ద ఉద్రిక్తత

**సిద్దిపేట మే 20(ప్రజాక్షేత్రం):**

సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాప్ వద్ద మద్యం ప్రియులు ఆందోళనకు దిగారు. వైన్స్ నుంచి కొనుగోలు చేసిన బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ కనిపించడంతో అవక్కాయ్యారు. బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ రావడంపై వినియోగదారులు వైన్స్ నిర్వాహకులను ప్రశ్నించగా, వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. దీంతో వినియోగదారులు, వైన్స్ నిర్వాహకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కల్తీ మద్యం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడుతూ, బాధ్యులపై కఠిన



చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సంబంధిత వైన్స్ షాప్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.సమాచారం అందుకున్న మిరుదొడ్డి ఎక్సైజ్ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని బాధితుల ఫిర్యాదును స్వీకరించారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల జోక్యంతో ఆందోళన విరమించుకుంది.





## కోట బాస్‌పల్లిలో క్రికెట్ లవర్స్ ప్రీమియర్ లీగ్

**తాండూర్, మే 20(ప్రజాక్షేత్రం):**

స్థానిక శివాజీ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ లవర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్1 టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు నిర్వహించిన ఈ పోటీల్లో పలుజట్లు పాల్గొని ప్రతిభ కనబరిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ జట్టు విజేతగా నిలవగా, అర్జున్ వారియర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువతకు క్రీడల్లో అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామ యువత, క్రీడాభిమానుల సహకారంతో పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## దుండిగల్‌లో బాలికపై లైంగిక దాడి..
## ఇద్దరు యువకులపై పోక్సో కేసు

**హైదరాబాద్ మే 20(ప్రజాక్షేత్రం):**

మైనర్ బాలికలపై రోజురోజుకూ మానభంగాలు, హత్యలు అధికం అవుతుండడం ఆందోళన కలిగించే విషయం. బండి భగీరథ పోక్సో కేసు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయ్యింది. బండి భగీరథ కేసు మరువక ముందే దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో మరో పోక్సో కేసు సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి విచారణ ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ గ్రామానికి చెందిన దార శివకుమార్ ఆలియాస్ మట్టు (20) గత కొంతకాలంగా దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర టెంట్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. 2025 సెప్టెంబర్ నెలలో డబుల్ బెడ్ రూమ్ దగ్గర టెంట్ హౌస్ లో పనిచేస్తున్న అతనికి అటుగా వెళుతున్న మైనర్ బాలికపై కన్ను పడింది. ఇదే అదనుగా భావించిన అతను మైనర్ బాలికను ఫాలో అయ్యాడు. దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ లో ఆమె వివరాలు తెలుసుకున్న దార శివ కుమార్ అదను కోసం వేచి చూశాడు. మూడు రోజుల అనంతరం బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని విషయాన్ని గ్రహించిన నిందితుడు బాలిక ఇంట్లోకి చొరబడి బాలికను బలవంతంగా అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరించడంతో బాధిత బాలిక ఎవరికి చెప్పలేదు. అదే నెలలో మరోసారి అతని స్నేహితుడు దుండిగల్ కు చెందిన నిజాంపేట్ రాము ఆలియాస్ రామ్ (30) తో కలిసి ఇద్దరు మరోసారి బాలికను బలవంతంగా అత్యాచారం చేశారు. నిత్యం చిత్రహింసలకు గురిచేస్తుండడంతో బాధిత బాలిక ఐదు రోజుల క్రితం జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. ఆందోళనకు గురైన బాలిక తల్లిదండ్రులు ఈ నెల 17న దుండిగల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు బుధవారం నిందితులను అరెస్ట్ చేశారు. మరిన్ని కనుగొనండి వార ఫలాలు బ్రేకింగ్ న్యూస్ జ్యోతిష్య సేవలు

**నిందితులపై పోక్సో కేసు**

నమోదు నిందితులు దుండిగల్ కు చెందిన దార శివకుమార్ ఆలియాస్ మట్టు (20), నిజాంపేట రాము ఆలియాస్ రామ్(30) లను అరెస్ట్ చేసిన పోలీస్ లు వారిపై సెక్షన్ 64(2), (ఎం), 351(2), రెడ్ విత్ 2(5), బిఎన్ఎస్ అండ్ 5 (1), రెడ్ విత్ 6 ఫోక్సో యాక్ట్ 2012 ప్రకారం నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## మైనర్ అమ్మాయిని వివాహం కానిస్టేబుల్

**సూర్యాపేట మే 20(ప్రజా-క్షేత్రం):**



మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పై హుజూర్ నగర్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదైంది. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలోని సీతారాం పురం గ్రామానికి చెందిన నాయని అనిల్ కుమార్ అనే వ్యక్తి యాదగిరి గుట్ట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈనెల 9వ తేదీన అనంతగిరి మండలానికి చెందిన ఓ మైనర్ బాలికను వివాహం చేసుకున్నాడు. బాల్య వివాహాలు చేసుకోవడం నేరమని తెలిసినప్పటికి ఓ కానిస్టేబుల్ బాల్యవివాహం చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. విషయం తెలుసుకున్న ఏసీడీఎస్ అధికారులు కానిస్టేబుల్ అనిల్ పై హుజూర్ నగర్ పీఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనిల్ పై బాల్య వివాహాలు నిరోధక చట్టంతో పాటుగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు...!

- ప్రభుత్వంలో ప్రక్షాళన ప్రక్రియ వేగవంతం...!
- సీనియర్ మంత్రుల శాఖలో మార్పులు....!
- ఢిల్లీ బాట పట్టిన ఎమ్మెల్యేలు..
- వికారాబాద్ జిల్లాకు అవకాశం దక్కేనా...?









తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు అయినట్లు తెలుస్తుంది. రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ముందుగానే (జూన్ 2 లోపు) ఈ విస్తరణ ఉండవచ్చని సమాచారం.పనితీరు బాగోలేని కొందరు మంత్రులకు ఉద్వాసన పలికి, కొత్తవారికి అవకాశం కల్పించే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కేబినెట్ లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకు రావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది. రేవంత్ సర్కార్ కొలువుదీరాక.. ఇప్పటి వరకు రెండు సార్లు విస్తరణ చేపట్టినా ఇంకా రెండు స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. ఆశావహులు చాలా మంది ఉండటం, సామాజిక, ప్రాంతీయ లెక్కలు తేలకపోవడంతో.. వాటిని పెండింగ్‌లోనే పెట్టింది హైకమాండ్. అల్రెడీ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండున్నరేళ్లు గడిచిపోవడంతో.. త్వరలో మిగిలిన ఆ రెండు స్థానాలను భర్తీ చేయాలని అధిష్టానం ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఆ దిశగా.. సీఎం రేవంత్, రాష్ట్ర నాయకత్వం.. హైకమాండ్‌తో మంతనాలు జరుగుతున్న నేపథ్యంలో.. పదవులు ఆశిస్తున్న వారంతా అలెర్ట్ అయ్యారు. పదవీని ఒడిసిపట్టేందుకు అంతర్గత పోటీ మరింత తీవ్రతరం అయ్యింది. ఎవరికి వారు ఢిల్లీ బాట పట్టి.. అగ్ర నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు.

మంత్రి పదవి ఎంపిక తమ చేతుల్లో ఏం లేదని,, ఏదైన ఉంటే ఢిల్లీలో తేల్చుకోవాలని ఇప్పటికే రాష్ట్ర నాయకత్వం క్లారిటీ ఇచ్చేసింది. దీంతో పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్టానం స్థాయిలో చర్చలు జరుపుతున్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు, పనితీరు ఆధారంగా కొందరిని మార్చే అవకాశం ఉందన్న ప్రచారంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ ఎమ్మెల్యేలతో పాటు సామాజిక, ప్రాంతీయ సమీకరణాల రీత్యా అవకాశం వస్తుందని భావిస్తున్న నేతలు ఇప్పటికే ఢిల్లీలో మకాం వేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. మూడు తరాలుగా తాము కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉన్నామని, బీఆర్ఎస్ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా కాంగ్రెస్‌ను వీడలేదని, తన నిబద్ధత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని తనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ విషయం తెలిసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హుటాహుటిన గత శనివారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తనకే అవకాశం కల్పించాలని గతంలో విన్నవించిన ఆయన.. మరోసారి తన ప్రయత్నాలను ముమ్మరం చేసేందుకు హస్తిన బాట పట్టారు. వీరిద్దరితో పాటు మరికొందరు ఆశావహులు కొంతకాలంగా ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు లాబీయింగ్ మొదలు పెట్టారు. గతంలో ఇచ్చిన హామీలు, పార్టీ కోసం చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ.. అధిష్ఠానం వద్ద మార్కులు కొట్టేసేందుకు ఎవరి వ్యూహాల్లో వారు బిజీగా ఉన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ విస్తరణపై కసరత్తు చేస్తున్నారనే లీకుల నడుమ.. ఒకే ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు బలమైన నేతలు ఒకరిని మించి ఒకరు ఢిల్లీ స్థాయిలో పోటీ పడటం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మంత్రివర్గ విస్తరణ వ్యవహారం గులాబీ శ్రేణులను కాదని, కాంగ్రెస్ లోపల ఉన్న సీనియర్ల మధ్య మరోసారి అంతర్గత విభేదాలకు, అసంతృప్తులకు దారి తీస్తుందా? అనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో చూడాలి.

కేబినెట్‌లో.. రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాకే ప్రాతినిథ్యం దొరకలేదు. దీంతో ఎక్కువగా ఆయా జిల్లాల నుంచి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయట. తమ జిల్లా నుంచి తనకే పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఈసారి క్యాబినెట్ విస్తరణలో సామాజిక సమతుల్యతతో పాటు రాబోయే ఎన్నికల వ్యూహాలకు పెద్దపీట వేయాలని హైకమాండ్ భావిస్తున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చే నివేదికలు, పార్టీ అంతర్గత సర్వేల ఆధారంగానే తుది ఎంపిక ఉంటుందని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఢిల్లీ పెద్దల ఆశీస్సులు ఎవరికి లభిస్తాయి?, ఎవరికి మంత్రి పదవి వరిస్తుంది?, ఎవరి పదవులకు ఎసరు వస్తుంది? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మంత్రి పదవుల కోసం ప్రధానంగా పోటీ పడుతున్న వారిలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే పి. రామ్మోహన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్సీ విజయశాంతి పేర్లు వినిపిస్తున్నాయి.

కొంతమంది సీనియర్ మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశం కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులను కేబినెట్ నుండి తొలగించే అవకాశం ఉందన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కొందరు నిత్యం వివాదాల్లో ఉండటం, మరి కొందరిపై అవినీతి ఆరోపణలు రావడం...అలాగే కేటాయించిన శాఖలో పెద్దగా ప్రోగ్రెసీవ్ కనిపించని వారిపై వేటు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో మొత్తం నాలుగు నుంచి.. ఐదుగురికి.. కొత్తగా చోటు కల్పిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఇందులో ఎస్టీ సామాజిక వర్గానికి కేబినెట్ లో ప్రాతినిధ్యం లేకపోవడంతో సీనియర్ ఎమ్మెల్యే అయిన బాలు నాయక్ కు అవకాశం దక్కే చాన్స్ ఉంది. రంగారెడ్డి జిల్లానుంచి ప్రాతినిధ్యం లేకపోవటంతో మల్ రెడ్డి రంగారెడ్డికి అవకాశం దక్కే చాన్స్ ఉంది. మరో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సైతం మార్పులు చేర్పుల్లో భాగంగా అవకాశం దక్కే చాన్స్ ఉంది. మున్నూరు కాపు, ఒక బిసి నేతకు సైతం ఇదే కోటాలో చాన్స్ దక్కే అవకాశం ఉంది. కొత్తగా ఉన్న రెండు,, ప్రక్షాళనలో ఖాళీ అయ్యే మూడు.. మొత్తంగా కేబినెట్‌లోకి ఐదుగ్గురికి చాన్స్ దక్కే అవకాశం ఉంది.

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి పదవుల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేబినెట్ విస్తరణతో పార్టీలో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి నేతల ఢిల్లీ టూర్లు ఫలిస్తాయా..? నేతల వినతులను.. అధిష్టానం ఆలకిస్తుందా చూడాలి.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్టు
7901503777

## ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించాలి: పెంట అజయ్ పటేల్

**నిజామాబాద్ జిల్లా, మే 20(ప్రజాక్షేత్రం) :**

విద్యా హక్కు చట్టం2009, సెక్షన్ 12(1)(C) ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో పేద, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఈ ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందించి, దాని ద్వారానే అడ్మిషన్లు నిర్వహించాలని కోరారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని, ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆయన కోరారు. అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని, ఒక ప్రాంతంలో అనుమతి పొంది మరో ప్రాంతంలో అక్రమంగా బ్రాంచీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అజయ్ పటేల్ డిమాండ్ చేశారు. మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించడంతో పాటు, అక్కడ తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, డిజిటల్ తరగతులు, ల్యాబ్‌లు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. బీసీ గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించి, సొంత భవనాల నిర్మాణం, నాణ్యమైన ఆహారం, వైద్య సదుపాయాలు కల్పించాలని, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయాలని, విద్యా హక్కు చట్టం అమలును పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సుంకరి పోతరాజు ముదిరాజ్, తవటం సత్యం నేత, కలవల నరసింహులు గౌడ్, కాల్వ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.




## హైదరాబాద్‌లో దారుణం..
## పట్టపగలు నడి రోడ్డుపై మహిళ

- పట్ల యువకుడి అసభ్య ప్రవర్తన..
- హైదరాబాద్‌లో పట్టపగలు బిడ్డతో వెళ్తున్న మహిళపై వేధింపులు
- అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఘటన.. సీసీటీవీలో రికార్డైన దృశ్యాలు
- వీడియో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- సుమోటోగా కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు.. నిందితుడి కోసం గాలింపు
- నిందితుడిని గుర్తించేందుకు 50కి పైగా సీసీటీవీ కెమెరాల పరిశీలన



**హైదరాబాద్ మే 20(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నగరంలో పట్టపగలు, నడిరోడ్డుపై ఓ మహిళ పట్ల యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తన బిడ్డతో కలిసి ఇంటికి వెళ్తున్న మహిళను వెనుక నుంచి వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ కావడం, ఆపై సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నగరవాసుల్లో భయాందోళనలు, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. నివాస ప్రాంతాల్లో మహిళల భద్రతపై ఈ ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 1:44 గంటల సమయంలో మణికొండనెక్నాంపూర్ పరిధిలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఈ ఘటన జరిగింది. ప్రాణతి ఈషా అపార్ట్‌మెంట్ సమీపంలో ఓ మహిళ తన బిడ్డను ఎడమ చేతితో ఎత్తుకుని, కుడి చేతిలో గొడుగు పట్టుకుని నడుచుకుంటూ వెళ్తోంది. ఎండ తీవ్రంగా ఉండటంతో ఇద్దరికీ గొడుగు అడ్డుపెట్టింది. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ టీనేజ్ యువకుడు, ఆమె దుస్తులను పైకి లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆకస్మిక పరిణామంతో ఏం జరిగిందో అర్థం కాక ఆ మహిళ వెంటనే వెనక్కి తిరిగింది. అప్పటికే ఆ యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. కొద్ది క్షణాలు నిశ్చేష్టురాలైన ఆమె, ఆ తర్వాత ఆ యువకుడు పారిపోయిన వైపు నడిచివెళ్లడం సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డ్ అయింది.

**రంగంలోకి పోలీసులు..**
**ప్రత్యేక బృందాల ఏర్పాటు**

ఈ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో నార్సింగి పోలీసులు వెంటనే స్పందించారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి, కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) కింద స్టాకింగ్, మహిళల గౌరవానికి భంగం కలిగించడం వంటి సెక్షన్ల కింద కేసు ఫైల్ చేసినట్లు ఇన్ స్పెక్టర్ జి. హరికృష్ణ రెడ్డి తెలిపారు. నిందితుడిని గుర్తించి, అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. "సీసీటీవీ ఫుటేజీని ఫ్రేమ్ బై ఫ్రేమ్ విశ్లేషిస్తున్నాం. నిందితుడి కదలికలను గుర్తించేందుకు చుట్టుపక్కల ఉన్న మరిన్ని కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నాం" అని ఇన్ స్పెక్టర్ వివరించారు. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఆ ప్రాంతంలోని 50 నుంచి 60 సీసీటీవీ కెమెరాలను పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# లైవ్‌లో రిషభ్ పంత్ బూతులు.. ఓటమిపై తీవ్ర అసహనం

- రాజస్థాన్‌పై ఓటమి తర్వాత తీవ్ర అసహనానికి గురైన రిషభ్ పంత్
- పోస్ట్ మ్యాచ్ ఇంటర్వ్యూలో అసభ్య పదజాలం
- ఓటమి ఎదురైనా తమది గొప్ప జట్టేనని, ఆత్మవిశ్వాసం తగ్గలేదని వ్యాఖ్య
- ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే లక్నో నిష్క్రమణ

ప్రజాక్షేత్రం :

రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) కెప్టెన్ రిషభ్ పంత్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. పోస్ట్ మ్యాచ్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆవేశంలో ఓ అసభ్య పదం వాడి వివాదంలో చిక్కుకున్నాడు. తమ జట్టు ఓడినా గొప్ప జట్టు అని చెబుతూ పంత్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

మంగళవారం జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో జట్టు 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన లక్నో ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 220/5 భారీ స్కోరు సాధించింది. అయితే, రాజస్థాన్ రాయల్స్ ఈ లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. డొనోవన్ ఫెరీరా అద్భుతమైన షాట్‌తో జట్టుకు విజయాన్ని అందించాడు.

ఓటమి తర్వాత పంత్ మాట్లాడుతూ, "ఫలితంతో సంబంధం లేకుండా మా జట్టు గురించి మేం గర్వపడతాం. మేం ఒక గొప్ప జట్టు. ఫలితాలు మాకు అనుకూలంగా రావడం లేదన్నది నిజమే. కానీ, అది మా ఆత్మవిశ్వాసాన్ని ఏమాత్రం తగ్గించలేదు" అని అన్నాడు. ఈ క్రమంలో ఆయన వాడిన పదం చర్చనీయాంశంగా మారింది.

ఈ పిచ్‌పై మరో 10 పరుగులు అదనంగా చేసి ఉండాల్సిందని పంత్ అభిప్రాయపడ్డాడు. ఇలాంటి వికెట్లపై బౌలర్లకు పెద్దగా అవకాశం ఉండదని, ఒత్తిడిలో సరైన ప్రణాళికలను అమలు చేయడం ముఖ్యమని వివరించాడు. కీలక సమయాల్లో అనుభవం లేకపోవడం కూడా జట్టును దెబ్బతీసిందని పంత్ పేర్కొన్నాడు.



# భారత టీ20 కెప్టెన్ రేసులో శ్రేయస్ అయ్యర్

- మైదానంలో, వెలుపల అయ్యర్ ఎంతో మెరుగయ్యాడు
- అయ్యర్ ఆటతీరులో ఎంతో పరిణతి కనిపిస్తోంది
- సుదీర్ఘ టోర్నమెంట్‌లో ఫామ్ హెచ్చుతగ్గులు సహజం
- చివరి మ్యాచ్‌లో అయ్యర్ ఫామ్‌లోకి వస్తాడని నమ్మకముంది
- భారత జట్టులో అయ్యర్ లేకపోవడంపై పాంటింగ్ ఆశ్చర్యం

ప్రజాక్షేత్రం :

భారత టీ20 జట్టు తదుపరి కెప్టెన్ రేసుపై పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం జట్టులోకి పునరాగమనం చేయడమే కాకుండా.. సూర్యకుమార్ యాదవ్ తర్వాత భారత టీ20 జట్టుకు కెప్టెన్ అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని పాంటింగ్ మద్దతు ప్రకటించాడు.

**రేసులో అయ్యర్**

భారత టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్ ముందున్నాడని రికీ పాంటింగ్ స్పష్టం చేశాడు. ఐపీఎల్ టోర్నీ ప్రారంభంలో అయ్యర్ ఎంతటి నాణ్యమైన ఆటగాడో అందరం చూశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మైదానం, వెలుపలా అతడు ఉన్న స్థితిని బట్టి చూస్తే కెప్టెన్సీకి సరైన ఎంపికగా కనిపిస్తున్నాడని అభిప్రాయపడ్డాడు.

**ఆటలో పరిణతి**

అయ్యర్ తన కెరీర్‌లో మునుపెన్నడూ లేనంత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడని పాంటింగ్ కొనియాడాడు. ప్రస్తుతం అతడు తన ఆటపై పూర్తి నియంత్రణతో ఉన్నాడని చెప్పాడు. ఐపీఎల్ లాంటి సుదీర్ఘమైన లీగ్‌లో 14 మ్యాచ్‌ల పాటు ఒకే రకమైన స్థిరత్వాన్ని కొనసాగించడం ఎవరికైనా కష్టమేనని, వ్యక్తిగతంగానూ, జట్టుగానూ హెచ్చుతగ్గులు రావడం సహజమేనని అయ్యర్ ఇటీవలి పేలవ ఫామ్‌ను సమర్థించాడు.

**తిరిగి పుంజుకుంటాడు**

పంజాబ్ కింగ్స్ వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్నప్పటికీ.. లక్నోతో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో అయ్యర్ కచ్చితంగా పుంజుకుంటాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు. ఆఖరి మ్యాచ్‌లో అయ్యర్ నిలబడి భారీ స్కోరు సాధిస్తే.. జట్టు విజయం సాధించే అవకాశాలు మెరుగవుతాయన్నాడు. అయ్యర్ కెప్టెన్సీ శైలి కూడా ఈ సీజన్‌లో ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించాడు.

**సెలక్టర్ల నిర్ణయంపై ఆశ్చర్యం**

గత కొన్నేళ్లుగా టీమ్‌ఇండియా ఎంపికలో శ్రేయస్ అయ్యర్ పేరు లేకపోవడం తనను ఎప్పుడూ ఆశ్చర్యానికి గురిచేస్తూనే ఉందని పాంటింగ్ ఓపెన్‌గా చెప్పాడు. ఈ ఐపీఎల్ ప్రదర్శన తర్వాత సెలక్టర్లు కచ్చితంగా అయ్యర్ పేరును పరిగణనలోకి తీసుకుంటారని భావిస్తున్నట్లు తెలిపాడు. కేవలం జట్టులోకి తీసుకోవడమే కాకుండా.. అతని పేరు పక్కన కెప్టెన్సీ ట్యాగ్ పెట్టడంపై కూడా ఆలోచన చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నాడు.

**కెప్టెన్సీకి సరైన సమయం**

భారత జట్టులోకి అంత తేలిగ్గా రీఎంట్రీ ఇవ్వలేమని, భారీగా పరుగులు సాధిస్తేనే అది సాధ్యమవుతుందని పాంటింగ్ అంగీకరించాడు. అయితే అయ్యర్ ప్రస్తుతం తన వయసు, ఆట పరంగా కెరీర్‌లోనే అత్యుత్తమ దశలో ఉన్నాడని విశ్లేషించాడు. ఒకవేళ భారత టీ20 కెప్టెన్సీ బాధ్యతలు అయ్యర్‌ను వరిస్తే.. అతడు ఆ అవకాశాన్ని వంద శాతం సద్వినియోగం చేసుకుంటాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు.



# నెగిటీవ్ టాక్‌కు బలవుతున్న టాలీవుడ్

- ప్రపంచ స్థాయికి ఎదుగుతున్న తెలుగు సినిమా... కానీ సోషల్ మీడియా విష సంస్కృతి వల్ల ప్రతిష్ఠకు పగుళ్లు

ఒకప్పుడు తెలుగు సినిమా అంటే కుటుంబాలతో కలిసి చూసే వినోద ప్రపంచం. హీరోల మధ్య పోటీ ఉండేది కానీ అది తెరపైనే పరిమితమయ్యేది. అభిమానుల మధ్య చర్చలు ఉండేవి కానీ అవి థియేటర్ వరకే ఆగిపోయేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియా అనే అస్త్రం చేతికి వచ్చాక టాలీవుడ్‌పై ప్రేమ కంటే ద్వేషం, సినిమా పట్ల ఆసక్తి కంటే హీరోలపై వ్యక్తిగత ఆరాధన, విమర్శల కంటే విషప్రచారమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్ ప్రపంచ స్థాయిలో తన ముద్ర వేస్తోంది. బాహుబలి నుంచి ఆర్ఆర్ఆర్ వరకు, పుష్ప నుంచి కల్కి వరకు తెలుగు సినిమా గ్లోబల్ మార్కెట్‌లో తన సత్తా చాటుతోంది. అయితే అదే సమయంలో టాలీవుడ్‌ను లోపలినుంచే బలహీనపరుస్తున్న ఒక ప్రమాదకరమైన ధోరణి పెరుగుతోంది. అది "నెగిటీవ్ టాక్ కల్చర్". ఒక సినిమా విడుదలైతే చాలు... కథ, నటన, సాంకేతిక విలువల గురించి చర్చ కంటే, ఆ హీరో ఏ వర్గానికి చెందినవాడు? ఏ ఫ్యాన్ బేస్‌కు దగ్గర? ఎవరి రాజకీయ అభిమాని? అనే కోణాల్లో దాడులు మొదలవుతున్నాయి.

**కులం, హీరోల ఫ్యాన్ బేస్‌గా విడిపోయి సోషల్ మీడియా వేదికగా వర్గపోరు**

తెలుగు సినిమా పరిశ్రమలో అభిమాన సంఘాలు కొత్తవి కావు. ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలం నుంచే అభిమానులు ఉన్నారు. కానీ అప్పటి అభిమానంలో గౌరవం ఉండేది. ఇప్పుడు సోషల్ మీడియా యుగంలో అభిమాన సంఘాలు క్రమంగా "డిజిటల్ సైన్యాలుగా" మారిపోయాయి. ప్రతి హీరోకు వేర్వేరు ట్రెండ్ టీమ్స్, యూట్యూబ్ ఛానల్స్, ట్రోలింగ్ బ్యాచ్‌లు తయారయ్యాయి. సినిమాపై చర్చ జరగాల్సిన చోట హీరోల కులం, రాజకీయ అనుబంధాలు, వ్యక్తిగత జీవితాలపై దాడులు జరుగుతున్నాయి. ఒక సినిమా ట్రైలర్ విడుదలైతే చాలు... లైక్స్ కంటే డిస్‌లైక్స్ ఎలా పెంచాలి? IMDb రేటింగ్ ఎలా తగ్గించాలి? ట్విట్టర్‌లో నెగిటివ్ హ్యాష్‌ట్యాగ్ ఎలా ట్రెండ్ చేయాలి? అనే ప్లానింగ్ జరుగుతోంది. ఇది కేవలం సినిమా విమర్శ కాదు... ఇది ఒక వర్గపోరాటంగా మారిపోయింది. కొంతమంది నెటిజన్లు సినిమాను కళగా కాకుండా తమ హీరో ఆధిపత్యాన్ని చూపించే యుద్ధభూమిగా మార్చేశారు. ఫలితంగా తెలుగు సినిమా సంస్కృతి క్రమంగా విషపూరితంగా మారుతోంది.

**"మావాడు గొప్ప అంటే మా వాడు గొప్ప" అంటూ విమర్శల పోరుబాట**

ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న ఫ్యాన్ వార్స్ చూస్తే అది సినిమా చర్చలా కాకుండా రాజకీయ యుద్ధంలా కనిపిస్తోంది. "మా హీరో ఇండస్ట్రీ నెంబర్ వన్", "మీ హీరో ఓవర్‌రేటెడ్", "మా హీరో రికార్డులు ఎవరికీ రావు" అంటూ రోజూ ట్రెండింగ్ యుద్ధాలు జరుగుతున్నాయి. సినిమా హిట్ అయ్యిందా లేదా అన్నది ప్రేక్షకుడి అభిరుచి నిర్ణయించాలి. కానీ ఇప్పుడు కలెక్షన్లు కూడా అభిమానుల ఆయుధాలుగా మారిపోయాయి. ఎవరి సినిమా ఎంత వసూలు చేసింది? ఎన్ని రికార్డులు బద్దలుకొట్టింది? అనే విషయాలపై ఫేక్ పోస్టర్లు, మోర్ఫింగ్ డేటా, తప్పుడు ప్రచారాలు విపరీతంగా పెరిగాయి. ఇది కేవలం ఆరోగ్యకరమైన పోటీగా ఆగిపోవడం లేదు. ఒక హీరో సినిమా విడుదలైతే ప్రత్యర్థి హీరో అభిమానులు ముందుగానే "డిజాస్టర్" ముద్ర వేసే పరిస్థితి వచ్చింది. కొన్ని సందర్భాల్లో సినిమాను చూడక ముందే నెగిటివ్ ప్రచారం మొదలవుతోంది. ఇది నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు, చిన్న టెక్నీషియన్లకు భారీ నష్టం తెస్తోంది. ఎందుకంటే ఒక సినిమా వెనుక వందల కుటుంబాల కష్టం ఉంటుంది. కానీ సోషల్ మీడియా యుద్ధాల్లో ఆ విషయం పూర్తిగా మరిచిపోతున్నారు.

**గతంలోని పాత వీడియోలు, కామెంట్స్‌తో నేటి జెన్ జీ యువత అర్థంలేని లాజిక్‌లతో ప్రశ్నల వర్షం**

సోషల్ మీడియా మరో ప్రమాదకరమైన ధోరణికి వేదికగా మారింది. అది "పాత వీడియోల రాజకీయాలు". పదేళ్ల క్రితం ఒక హీరో చెప్పిన మాట, పాత ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్య, ఒక ఈవెంట్‌లో జరిగిన చిన్న ఘటన... ఇవన్నీ తవ్వి తీసి నేటి పరిస్థితులకు అన్వయిస్తూ ట్రోలింగ్ చేస్తున్నారు. నేటి జెన్ జీ యువతలో కొంతమంది సమాచారం కంటే వైరల్ కంటెంట్‌ను ఎక్కువగా నమ్ముతున్నారు. పూర్తిస్థాయి సందర్భం తెలియకుండానే క్లిప్పింగ్‌ల ఆధారంగా తీర్పులు ఇస్తున్నారు. ఒక హీరో ఒక సందర్భంలో చెప్పిన మాటను వక్రీకరించి, దానికి రాజకీయ రంగు అద్దుతూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. దాంతో అసలు విషయంపై కాకుండా, వివాదంపైనే చర్చ ఎక్కువ అవుతోంది. ఇది క్రమంగా వ్యక్తిగత ద్వేష సంస్కృతికి దారితీస్తోంది. కళాకారుడి పని, నటన, ప్రతిభ గురించి మాట్లాడకుండా... అతని వ్యక్తిగత అభిప్రాయాలపై విచారణ జరుగుతోంది.

**ఆలోచన మరిచి, ఆవేశం వెలసి హీరోల పరువు తీస్తున్న ఫ్యాన్స్**

అభిమానిగా ఉండటం తప్పు కాదు. కానీ అభిమానం అంధవిశ్వాసంగా మారితే అది ప్రమాదకరం. ప్రస్తుతం కొన్ని ఫ్యాన్ గ్రూపులు హీరోలను కాపాడుతున్నామనే పేరుతో వారికే నష్టం చేస్తున్నారు. ఒక చిన్న విమర్శ వచ్చినా వ్యక్తిగత దూషణలు, కుటుంబాలపై కామెంట్లు, అసభ్య పదజాలం వాడటం సాధారణమైపోయింది. కొందరు అభిమానులు తమ హీరోల పేరుతో చేసే పోస్టులు చూసి సామాన్య ప్రేక్షకులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. హీరోలు చాలా సందర్భాల్లో పరస్పరం గౌరవంగా ఉంటారు. కానీ అభిమానులే వారిని శత్రువులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా హీరోల ఇమేజ్ దెబ్బతింటోంది. ప్రేక్షకుల్లో "టాక్సిక్ ఫ్యాన్ కల్చర్"పై వ్యతిరేక భావన పెరుగుతోంది. ఇది దీర్ఘకాలంలో హీరోల మార్కెట్‌పైనే ప్రభావం చూపే అవకాశం ఉంది.

**పనిగట్టుకుని సినిమాపై నెగిటివ్ పబ్లిసిటీ తీసుకువస్తున్నారు**

ఇప్పుడు టాలీవుడ్‌లో కొత్తగా కనిపిస్తున్న ట్రెండ్ "ఆర్గనైజ్డ్ నెగిటివ్ క్యాంపెయిన్". సినిమా విడుదలకు ముందే కొన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్ టార్గెట్ ఫిక్స్ చేసుకుని నెగిటివ్ ప్రచారం మొదలుపెడుతున్నాయి. టీజర్ వచ్చిన రోజు నుంచే "కాపీ సినిమా", "డిజాస్టర్", "ఓవర్ హైప్" అంటూ పోస్టులు వైరల్ చేస్తున్నారు. యూట్యూబ్‌లో థంబ్‌నెయిల్‌ల కోసం అతిశయోక్తి శీర్షికలు పెడుతున్నారు. సినిమా బాగున్నా కూడా "ఫ్లాప్" అనే నెరేటివ్ క్రియేట్ చేయడానికి కొందరు కష్టపడుతున్నారు. ఇది కేవలం అభిప్రాయ స్వేచ్ఛ కాదు... కొన్నిసార్లు ఉద్దేశపూర్వక బ్రాండ్ డ్యామేజ్‌గా మారుతోంది. ఇలా నెగిటివ్ ప్రచారం వల్ల ఓపెనింగ్స్ తగ్గితే నిర్మాతలకు కోట్ల నష్టం వస్తోంది. ముఖ్యంగా చిన్న సినిమాలు ఈ దాడులను తట్టుకోలేక మునిగిపోతున్నాయి.

**ముఖ్యంగా మెగా హీరోలే టార్గెట్‌గా విషప్రచారం చేస్తున్న ఓ వర్గం**

ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో మెగా కుటుంబ హీరోలను లక్ష్యంగా చేసుకుని తీవ్రమైన ట్రోలింగ్ జరుగుతోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత విభజనలు, అభిమాన వర్గాల పోటీ... ఇవన్నీ కలిసి ఒక ప్రత్యేక డిజిటల్ యుద్ధంగా మారాయని కొందరు సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని రాజకీయ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులు, కొన్ని ఫ్యాన్ వర్గాలు కలిసి మెగా హీరోల సినిమాలపై నెగిటివ్ ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ఒక సినిమా విడుదలైతే చాలు... ట్రోలింగ్, మీమ్స్, బాయ్‌కాట్ హ్యాష్‌ట్యాగ్‌లు వరుసగా కనిపిస్తున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లో అభిమానులు కూడా సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఒక హీరోను కించపరచడం ద్వారా మరొక హీరో స్థాయి పెరగదు. చివరికి నష్టపోయేది మొత్తం తెలుగు సినిమా పరిశ్రమే.

**ప్రపంచస్థాయిలో టాలీవుడ్ హీరోలు ముందుకు వెళ్తుంటే... ఫ్యాన్ వార్స్ మాత్రం తగ్గటం లేదు**

ఇప్పుడు తెలుగు సినిమా హాలీవుడ్ స్థాయిలో చర్చకు వస్తోంది. ఆస్కార్ వేదికపై తెలుగు పాట మార్మోగింది. పాన్ ఇండియా మార్కెట్‌లో తెలుగు హీరోలు ఆధిపత్యం చూపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమాలకు ప్రేక్షకులు పెరుగుతున్నారు. ఇలాంటి సమయంలో టాలీవుడ్ అంతర్గతంగా విభజనలతో కొట్టుమిట్టాడటం ఆందోళన కలిగించే విషయం. బయట ప్రపంచం తెలుగు సినిమాను గౌరవంగా చూస్తుంటే... మనం మాత్రం మన హీరోలను మనమే కించపరుచుకోవడం విచారకరం. బాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలతో పోటీ పడుతున్న సమయంలో అభిమానుల మధ్య యుద్ధాలు పరిశ్రమ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. సోషల్ మీడియాలో కనిపించే ద్వేషపూరిత వాతావరణం కొత్త ప్రేక్షకులను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది.

**కట్టడి చేయకపోతే టాలీవుడ్ ఎదుగుదలకు ఆటంకం తప్పదని మేధావుల హెచ్చరిక**

సినిమా అనేది కేవలం వినోదం మాత్రమే కాదు... అది ఒక సాంస్కృతిక శక్తి. అలాంటి పరిశ్రమను అభిమానుల ద్వేష రాజకీయాలు బలహీనపరిస్తే దీర్ఘకాలంలో తీవ్రమైన నష్టం జరుగుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై బాధ్యతారహిత ప్రచారాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. అభిమాన సంఘాలు కూడా సంయమనం పాటించాలి. హీరోలు స్వయంగా ముందుకొచ్చి అభిమానులకు సానుకూల సందేశాలు ఇవ్వాలి. సినిమా విజయం ప్రేక్షకుడి తీర్పుతో నిర్ణయించాలి గానీ, ట్రోలింగ్ సైన్యాల నిర్ణయంతో కాదు. విమర్శ ఉండాలి... కానీ అది నిర్మాణాత్మకంగా ఉండాలి. ద్వేష ప్రచారం కాదు. టాలీవుడ్ ప్రస్తుతం ప్రపంచాన్ని ఆకర్షించే దశలో ఉంది. ఈ సమయంలో అంతర్గత విభేదాలు, ఫ్యాన్ వార్స్, కుల రాజకీయాలు పెరిగితే... అది తెలుగు సినిమా భవిష్యత్తుపైనే మచ్చగా మిగిలిపోతుంది. సినిమా అంటే కళ. హీరో అంటే నటుడు. అభిమానం అంటే గౌరవం. ఈ మౌలిక విలువలను మళ్లీ గుర్తు చేసుకునే సమయం ఇప్పుడు వచ్చింది.



ఇక్కుర్తి వెంకటేష్
గుంటూరు జిల్లా
9542266666

# 'A' సింబల్ సంబరాలు వైరల్ సీక్రెట్ విప్పిన వైభవ్ సూర్యవంశీ

- ఐపీఎల్‌లో చెలరేగి ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ
- లక్నోపై 38 బంతుల్లోనే 93 పరుగులు
- 23 బంతుల్లో హాఫ్ సెంచరీ
- అర్ధ శతకం తర్వాత వేళ్లతో 'A' సింబల్
- వాళ్ల అమ్మ పేరు 'A'తో మొదలవుతుందని వెల్లడి

ప్రజాక్షేత్రం :

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ పరుగుల వరద పారిస్తున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఈ కుర్రాడు వీరబాదుడు బాదాడు. హాఫ్ సెంచరీ తర్వాత వేళ్లతో 'A' సింబల్ చూపిస్తూ చేసిన సంబరాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

**సీక్రెట్ ఇదే**

మ్యాచ్ ముగిసిన తర్వాత కామెంటేటర్ మురళీ కార్తీక్ ఆ 'A' సింబల్ సెలబ్రేషన్స్ గురించి వైభవ్‌ను అడిగారు. మొదట వైభవ్ కాస్త నవ్వుతూ సరదాగా దాటవేసే ప్రయత్నం చేశాడు. ప్రతి మ్యాచ్‌లో ఏదో ఒక కొత్తదనం చూపించడానికి అలా చేశానని చెప్పాడు. కానీ చివరకు అసలు రహస్యాన్ని బయటపెట్టి అందరినీ భావోద్వేగానికి గురిచేశాడు. అద్భుతమైన ఇన్నింగ్స్‌ను తన తల్లికి అంకితం ఇస్తున్నట్లు వైభవ్ ప్రకటించాడు. తన తల్లి పేరు 'A' అక్షరంతో మొదలవుతుందని అందుకే వేళ్లతో ఆ సింబల్ చూపించానని స్పష్టం చేశాడు. అమ్మపై ఉన్న ప్రేమను ఇలా మైదానంలో చాటుకోవడంతో అభిమానులు ఈ కుర్రాడిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.



**వైభవ్ వీరకొట్టుడు**

వైభవ్ సూర్యవంశీ లక్నో బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. మొదట్లో కాస్త నెమ్మదిగా ఆడినా తర్వాత గేర్ మార్చాడు. కేవలం 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. తర్వాత మరింత రెచ్చిపోయి కేవలం 38 బంతుల్లో 93 పరుగులు చేసి త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు.

**ప్లే ఆఫ్స్ రేసులో రాజస్థాన్**

ఈ మ్యాచ్‌లో ఘన విజయం సాధించడంతో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి దూసుకొచ్చింది. ముంబై ఇండియన్స్‌తో జరిగే తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తు ఖాయం అవుతుంది. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి.

# పంచ్‌తో 'వైబ్' గ్యారంటీ



అందం.. అభినయంతో అలరించే సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింటా తెరపై కనిపించి చాలా ఏళ్లయ్యింది. ఇన్నేళ్ల తర్వాత 'వైబ్' అనే చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా పంచుకుంది. "పంచ్.. పంచ్‌లైన్ రెండూ వైబ్‌తో గ్యారంటీ' అనే వ్యాఖ్యల్ని పేర్కొంటూ.. ఈ సినిమా సెప్టెంబరు 18న థియేటర్లలో విడుదల కానుందని తెలిపింది. ఈ మేరకు చిత్రబృందంతో కలిసి ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ సినిమాని హిందీ నటుడు కునాల్ కెమ్ము తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయన, ప్రీతి, స్పర్శ్ శ్రీవాస్తవ, వాన్సిక ధిర్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు.

# చేస్తే అలాంటి సినిమాలే చేయాలి..

సౌత్ సినీ పరిశ్రమలో ప్రస్తుతం మమితా బైజు పేరు ఒక బ్రాండ్‌గా మారుతోంది. గ్లామర్ పాత్రల కంటే కూడా పర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న క్యారెక్టర్స్ ఎంచుకుంటూ స్టార్ హీరోల సరసన ల్యాండ్ అవుతోంది. రాబోయే రోజుల్లో విడుదల కానున్న ఆమె లైనప్ చూస్తే.. సౌత్ బాక్సాఫీస్ వద్ద ఈమె రేంజ్ మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం (Career Journey), తన కెరీర్, ఫ్యాన్స్, ఫ్యూచర్ ప్లాన్స్ గురించి మమితా బైజు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది

'నా అభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే విభిన్నమైన చిత్రాలను చేయాలన్నదే నా ఏకైక లక్ష్యం. సినిమాల ద్వారా ఒక మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. నా కెరీర్ ముగిసిన తర్వాత లేదా భవిష్యత్తులో ఎప్పుడైనా నా గతాన్ని, నేను ప్రయాణించిన కాలాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ముఖంలో ఒక తెలియని ఆనందం, తృప్తి కలగాలి. అందుకోసమే నేను కథల ఎంపికలో ఇంత జాగ్రత్తగా ఉంటూ నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని చెప్పుకొచ్చింది.

ఇక రాబోయే కొద్ది నెలల్లో ఆమె నటించిన మూడు క్రేజీ సినిమాలు.. జననాయకన్ (తెలుగులో 'జన నాయకుడు'), విశ్వనాథ్ అండ్ సన్స్, ఇరండు విధానం.. వంటి మమితా బైజు నటించిన బ్యాక్-టు-బ్యాక్ థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ మూడు సినిమాలు కనుక బాక్సాఫీస్ వద్ద అనుకున్న రేంజ్‌లో క్లిక్ అయితే.. సౌత్ ఇండియాలోనే టాప్ లీగ్ హీరోయిన్ల జాబితాలోకి మమితా చేరడం ఖాయం.



# ముందు ఆర్థిక స్వేచ్ఛ.. తర్వాతే పెళ్లి



మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే.. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. ''రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలా మంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది. మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు, ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన జీవితాన్ని మీరే నిర్మించుకోండి. ఎవరి మాటా వినకండి'' అని కంగనా ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల జరిగిన వివాహిత మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో కంగనా ఈ పోస్ట్ పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. కంగనా నటిస్తున్న 'భారత భాగ్య విధాత' వచ్చే నెల 12న విడుదల కానుంది.



## సోషల్ మీడియాకు
# రియా చక్రవర్తి బ్రేక్..

బాలీవుడ్ వివాదాస్పద నటి రియా చక్రవర్తి మరోసారి వార్తల్లో నిలిచారు. దివంగత నటుడు, తన మాజీ ప్రియుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత ఎదుర్కొన్న లీగల్ కేసులు, అరెస్టులు, తీవ్రమైన సోషల్ మీడియా ట్రోలింగ్స్ నుండి కోలుకుని.. ఇప్పుడిప్పుడే కెరీర్‌పై ఫోకస్ పెడుతున్న రియా, సడన్‌గా ఒక షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. కొంతకాలం పాటు సోషల్ మీడియాకు పూర్తిగా బ్రేక్ ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

'ఈ మధ్య కాలంలో నన్ను నేను కాస్త మిస్ అవుతున్నట్లు అనిపిస్తోంది. సోషల్ మీడియాలోని నిరంతర శబ్దం, స్క్రోలింగ్, ఆన్‌లైన్ ప్రపంచంతో పోటీ పడటం.. ఇవన్నీ నేను ఊహించిన దానికంటే ఎక్కువ భారంగా అనిపిస్తున్నాయి. ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా గడపాలి. అందుకే కాస్త  సోషల్ మీడియా నుండి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. ప్రస్తుతానికి వర్చువల్ లైఫ్ కంటే నిజ జీవితంలో గడిపే క్షణాలకే నా మొదటి ప్రాధాన్యత. త్వరలోనే మళ్లీ కలుద్దాం' అంటూ తెలిపింది.

కానీ నటిగా మాత్రం ఒక అద్భుతమైన కంబ్యాక్ ఇవ్వనుంది.. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ (Netflix) ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సరికొత్త ఒరిజినల్ వెబ్ సిరీస్ 'ఫ్యామిలీ బిజినెస్' (Family Business) లో రియా ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించనున్నారు.ఈ సిరీస్‌లో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్, విజయ్ వర్మ, నేహా ధూపియా, ధృవ్ సెహగల్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో స్ట్రీమింగ్‌కు రాబోతుంది.


# సూఎన్టీఆర్ ఇంట్లోకి కొత్త అతిథులు.. జపాన్ పేర్లు ఎందుకు పెట్టారో తెలుసా?

ఎన్టీఆర్ లైనప్ ఎంత బిజీగా ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే, ఎంత బిజీగా ఉన్నా తన పర్సనల్ లైఫ్‌కు, ఫ్యామిలీకి టైమ్ కేటాయించడంలో తారక్ ఎప్పుడూ ముందే ఉంటారు. తాజాగా ఆయన తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి. పుట్టిన రోజున ఎన్టీఆర్ తన ఇంట్లోకి రెండు సరికొత్త రంగురంగుల పెట్స్ (మకావ్ జాతికి చెందిన పక్షులు)ను పరిచయం చేశారు. నెరిసిన గడ్డం, స్లీవ్‌లెస్ టీషర్టుతో సరికొత్త రగ్గడ్ లుక్‌లో ఉన్న తారక్.. నేలపై కూర్చుని ఆ పక్షులతో సరదాగా గడుపుతున్న పిక్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. ఒక పక్షి ఆయన చేతిపై వాలగా, మరొకటి కింద ముద్దుగా చూస్తూ కూర్చుంది.

ఈ బర్డ్స్‌ను పరిచయం చేస్తూ తారక్ పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వాటికి ఆయన 'అసాహి', 'యూహి' అని పేర్లు పెట్టారు. జపనీస్ భాషలో 'అసాహి' అంటే ఉదయించే సూర్యుడు (సూర్యోదయం) అని, 'యూహి' అంటే అస్తమించే సూర్యుడు (సూర్యాస్తమయం) అని అర్థం. జపాన్ దేశంపై, అక్కడి సంస్కృతిపై తనకున్న అమితమైన ప్రేమను చాటుకునేందుకే తన ముద్దుల పక్షులకు ఈ జపనీస్ పేర్లను పెట్టినట్లు ఎన్టీఆర్ స్వయంగా వెల్లడించారు. 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్ల సమయం నుండి జపాన్ ఆడియన్స్‌తో తారక్‌కు ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ బాండింగ్‌ను ఇలా తన ఇంట్లోని కొత్త అతిథుల రూపంలో ఆయన గుర్తుచేసుకోవడం విశేషం.




# ఇలాంటి పనులు చేయడం ఎంత సిగ్గుచేటు..



టుడు ఆర్. మాధవన్ ఇటీవల ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంలో కనిపించారు. ఈ మూవీ భారీ విజయం సాధించడమే కాకుండా భారీ కలెక్షన్లు రాబట్టి పలు రికార్డులు తిరగరాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మాధవన్ యష్ రాజ్ ఫిలిమ్స్ వారి 'ఆల్ఫా'తో పాటు, తమిళంలో అదృష్టశాలి, జీడీఎన్, 'సర్కిల్' అనే బైలింగువల్ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్నారు. అంతే కాకుండా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ఆయన తన వ్యక్తిగత జీవితంపై, అలాగే తన కొడుకు కెరీర్ విషయంలో తీసుకుంటున్న కీలక నిర్ణయాల గురించి చెప్తూ ఎమోషనల్ అవుతున్నాడు. తాజాగా, మాధవన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పెట్టిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. ఆయన ఒక హెల్త్ బ్రాండ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా, పాత ఇంటర్వ్యూ క్లిప్‌లను వాడుకుంటూ తమ బరువు తగ్గే ప్రోగ్రామ్‌లను ప్రమోట్ చేసుకుంటున్న 'ఎలివేట్ నౌ' అనే వెల్నెస్ సంస్థకు ఆయన లీగల్ నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ విషయాన్ని మాధవన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ ప్రజలను హెచ్చరించారు. సదరు హెల్త్ బ్రాండ్ మాధవన్ గతంలో మాట్లాడిన ఒక ఫిట్‌నెస్ ఇంటర్వ్యూ వీడియోను, ఫోటోలను వాడుకుంటూ సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో యాడ్స్ రన్ చేసిందట.

దీనివల్ల మాధవన్ స్వయంగా ఆ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు తెలుసుకున్న నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఈ విషయంపై మాధవన్ స్పందిస్తూ "ఎంత సిగ్గుచేటు! ఇలాంటి సంస్థలు తాము చేస్తున్న తప్పుల నుండి ఎలా తప్పించుకోగలమని భావిస్తున్నాయి? ఎవరిదో పాత ఇంటర్వ్యూ క్లిప్ తీసుకుని, దాన్ని మీ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌గా ఎలా వాడుకుంటారు?" అని ఫైర్ అయ్యారు. అంతేకాకుండా ఇప్పటికే సదరు సంస్థకు లీగల్ నోటీసులు పంపినట్లు స్పష్టం చేసిన ఆయన, ఇలాంటి సంస్థల పట్ల ప్రజలు, అభిమానులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిజానికి మాధవన్ తన ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి కృత్రిమ పద్ధతులు, మందులు వాడరని ఇండస్ట్రీలో మంచి పేరుంది. కేవలం 21 రోజుల్లోనే ఆయన ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ , మితంగా తినడం, క్రమశిక్షణతో కూడిన అలవాట్ల ద్వారా అద్భుతమైన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ సాధించారు. ఎటువంటి కఠినమైన డైట్లు లేకుండానే కేవలం సహజ పద్ధతుల్లో బరువు తగ్గానని ఆయన గతంలో చెప్పారు. అలాంటి తన వీడియోలను కమర్షియల్ వెయిట్ లాస్ ప్రోగ్రామ్‌ల కోసం వాడుకోవడంపై ఆయన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఈ విషయంపై సోషల్ మీడియాలో సంచలనంగా మారింది.

## బాలయ్య సినిమాలో మంచు మనోజ్..
# అధికారికంగా ప్రకటించిన టీమ్



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. '#NBK111'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టీమ్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలో నటుడు మంచు మనోజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. 'మీ పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులు చూడడం కోసం వేచి చూస్తున్నా' అని రాశారు. ఇందులో ఆయన విలన్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో బాలకృష్ణ , మంచు మనోజ్ ఇద్దరూ 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' సినిమాలో నటించారు. ఇది రెండో చిత్రం కావడం విశేషం.

హిస్టారికల్ మూవీగా తెరకెక్కుతోన్న '#NBK111'లో బాలకృష్ణ (Balakrishna) ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. 'వీర సింహారెడ్డి' విజయం తర్వాత గోపిచంద్ మలినేని బాలయ్య నుంచి వస్తున్న రెండో చిత్రమిది. ఇందులో బాలకృష్ణకు జోడీగా నయనతార నటించనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. తాజాగా నయన్ స్థానంలో కాజల్ తీసుకున్నట్లు టాలీవుడ్ టాక్. దీనిపై చిత్ర బృందం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి సంగీతం తమన్ అందిస్తున్నారు. బాలయ్య కోసం తమన్ వర్క్ చేస్తోన్న ఆరో ప్రాజెక్ట్ ఇది. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు మనోజ్ కూడా భాగం కావడంతో అంచనాలు పెరిగాయి.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394